ఆదివారం

ప్రజాశక్తి

ఏప్రిల్ 24, 2005



నవరత్నాల వారసత్వం

ప్రకాశ్ కరత్

హ్యాపీ బర్త్‌డే

24.4.2005నుంచి
30.4.2005వరకు

వెంకట తేజ
3సం॥, 24.4.2002
విజయగౌరి-భగవంతరావు
వాయల్పాడు-చిత్తూరు

సాయికిషోర్‌చంద్ర
1సం॥, 24.4.2004
నాగలక్ష్మి-సత్యకుమార్
మచిలీపట్నం-కృష్ణా

భవాని
5సం॥, 24.4.2000
పద్మావతి-రామయ్య
అంచులవారిపాలెం-గుంటూరు

శ్రీలక్ష్మి
5సం॥, 26.4.2000
విజయలలిత-నాగరాజు
అనంతపురం

కిరణ్మయి
4సం॥, 27.4.2001
లక్ష్మి-అయ్యబాబు

భారతి
8సం॥, 28.4.1997
శ్రీలత-శ్రీనివాసరావు
కృష్ణలంక-విజయవాడ

నీరజ
4సం॥, 29.4.2001
కామేశ్వరి-ఉదయభాస్కర్
కోష్ఠ-శ్రీకాకుళం

మీనాక్షి
1సం॥, 29.4.2004
దుర్గ-మహేష్‌బాబు
రాజుపేట-మచిలీపట్నం

ఇమ్రాన్‌బేగం
3సం॥, 30.4.2002
జబీనాబేగం-అఫ్జల్ బేగ్
కృష్ణలంక-విజయవాడ

సంజు
6సం॥, ఏప్రిల్-1999
కాంచన-సోమయ్య
కవాడిగూడ-హైదరాబాద్

త్రిష
1సం॥, ఏప్రిల్-2004
విజయలక్ష్మి-గోపాల్
ఖానాపూర్-మ॥నగర్

సంధ్యారాణి
9సం॥, ఏప్రిల్-1996
జ్యోతి-మణిరత్నం
పుంగనూరు-చిత్తూరు

వసంత రాజ్ కుమార్
6సం॥, ఏప్రిల్-1999
వసంతకుమారి-శాంతరాజు
యర్రగుంట్ల-కడప

శ్రావణి
9సం॥, ఏప్రిల్-1996
లక్ష్మమ్మ-వెంకటకొండయ్య
కొనకనమట్ల-ప్రకాశం

రాజశేఖర్
4సం॥, ఏప్రిల్-2001
రామలక్ష్మి-మల్లేశ్వరరావు
పైడిభీమవరం-శ్రీకాకుళం

భూమిక
9సం॥, ఏప్రిల్-1996
శ్రీదేవి-సంతోష్‌రెడ్డి
మరపెడబంగ్లా-వరంగల్

జున్ను
రోషన్
కొత్తచెరువు-అనంతపురం

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం



కవర్‌స్టోరీ

ఏప్రియల్ 10 ఆదివారం అనుబంధం కవర్‌స్టోరీ "కొత్తపోప్ ఎవరు? జాన్‌పాల్ IIకి సెలవు" బాగుంది. కవర్‌స్టోరీ రచయిత ప్రారంభంలోనే ఓ విశిష్ట వ్యక్తి మరణం, ఆ తదనంతరం ఆయన స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారనేది! అందరి దృష్టిలో ప్రధాన అంశం? అంటూ ప్రారంభించి, ప్రపంచవ్యాప్తంగా మానవహక్కుల పరిరక్షణకు పోప్‌పాల్ II పేరు పొందారు కాని మహిళలకు సంబంధించినంతవరకు పోప్ ఆలోచనలు ఐదో శతాబ్దానికి చెందినవని విమర్శకు గురయ్యారన్నది నూటికి నూరుపాళ్ళు వాస్తవం. ఏది ఎలావున్నా మతాన్ని, మత పవిత్రతను (అ) రాజకీయాలతో మిళితం కాకుండా చూడగలిగే మహోన్నతుణ్ణి పోప్‌గా ఎన్నిక కావాలి.

–సిరిపురపు రామకోటేశ్వరరావు

ఎనికేపాడు

మంచి మతాచార్యుడు రావాలి

ఈ వారం కవర్‌స్టోరీ చక్కగా రాశారు. క్షమాగుణం కలవారిని పోప్‌గా ప్రసాదించు దేవుడా అంటూ ముగింపు బాగుంది. ఆస్ట్రేలియన్ ఫాదర్ గ్రాహమ్ స్టెయిన్‌ను గుర్తుచేయడం ఎంతో సందర్భోచితంగా ఉంది. పోప్ జాన్‌పాల్ గారి గురించి తెలిసినవారూ, తెలియనివారు ఆసక్తిగా చదివేలా చక్కగా వివరించింది ఈ వ్యాసం.

–పి విలియం మేరీ,

పాడేరు, విశాఖజిల్లా



చప్పట్లే... చప్పట్లు

కథలు వినోదాత్మకంగానేకాదు, విజ్ఞానదాయకంగా కూడా వుంటున్నాయి. చప్పట్లే...చప్పట్లు కథ చాలా బాగున్నది. కవులు, రాజకీయ నాయకులు చెప్పేది ప్రజలకొరకే అని చెప్పినా, తమ స్వార్థంకొరకు వాళ్లు కృషి చేస్తున్నారు. ఉపన్యాసాలు, కవిత్వాలు అన్ని తమకున్న అనుభవాలను, పరిశోధనను తక్కినవారికి అందించి సమాజాన్ని విజ్ఞానవంతం చేయటమేనని గ్రహించలేక పోతున్నారు. తమ కీర్తి ధనం కొరకు కాదని తెలుసుకోవటం, సన్మానాలే ప్రధానంగా జీవించేవారు అర్థంచేసుకోవాలి. "వాళ్ళూ బ్రతకాలికదా!"(జీవనశైలి) ఎంతో సందేశాత్మకంగా వున్నది. వర్ణదోపిడి విధానంలో తమలా ఇతరుల పతనాన్ని గమనించలేని నంన్కృతిని చక్కగా ఖండించారు. ఇటువంటి సందేశాత్మక కథలు, వ్యాసాలు ప్రజాశక్తి పత్రికలో రావటం చాలా అభినందనీయం.

మురళీధర్

విజయవాడ



కళాసాహితి

నా వంచ ప్రాణాలలో ప్రతీ ప్రాణంలోను నాటకముందన్న గంగోత్రి (దాసరి) సాయిగారి గురించి "నేటి మేటి విలన్" ఇంటర్వ్యూ బాగుంది. బుల్లితెరపై విలన్‌గా నటించాలంటే చిన్నతనంగా భావించే ప్రస్తుత తరుణంలో ఆ లోటును సాయిగారు తీరుస్తారని ఆశిద్దాం. పరిషత్తులలో తనసత్తా చూపినవిధంగా తెరపై కూడా తన నటనా వైదుష్యాన్ని ప్రదర్శించగలరని ఆశిద్దాం. అజ్ఞాత కళాకారులను వెలుగులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న మన ప్రజాశక్తి ఆదివారంకు అభివందనములు.

యర్రమోతు ధర్మరాజు

ధవళేశ్వరం, తూర్పుగోదావరి జిల్లా

మనలోమాట

10వ తేదీ ఆదివారం అనుబంధంలో ''కోయిలగొంతు కేమయిందో...'' అని, వలుభావాల మేళవింపుతో చెప్పిన 'మనలోమాట' బాగుంది. బాలలకథ "సర్కస్‌గుర్రం", 'ప్రజాశక్తి' కవిత బాగున్నాయి.

ఎస్.కె. జహంగీర్

నెల్లూరు జిల్లా

మహానుభావులు మరి!

మనలో కొందరు మహానుభావులుంటారు. వారికి సమస్తం వేదాల్లోనే దృగ్గోచరమవుతుంది. విమానాలు, రాకెట్లు, క్షిపణులు, దూరశ్రవణ, దూరదర్శన్ ఇత్యాది సమస్త ఆవిష్కరణలన్నీ పురాణకాలాల్లో మస్తు మస్తుగా ఉండినవేనని విశదీకరిస్తారు. ఈ భూగోళం మీద ఏమూల కొత్తగా ఏది కనిపెట్టినా మాగొప్ప లేద్దూ... ఫలానా వేదంలో ఆనాడే దీనిగురించి ప్రస్తావించారోయ్ అంటూ కళ్లు తెరిపిస్తారు. మన అజ్ఞానపు తిమిరాలను తొలగించడానికి తలతిరిగేలా పెద్ద ఉపదేశమే చేస్తారు. స్వామీ తమరి ఉపదేశం అద్భుతం, గానీ అసలు పాయింట్ అర్థం కాలేదు అని అన్నారో... నీ ఖర్మ అంటూ గోచీ దులిపేసుకొని అక్కడినుండి నిష్క్రమిస్తారు. ఏతా... వాతా... చెప్పొచ్చేదేమిటంటే కొన్ని సంగతులను అర్థం చేసుకోవాలి తప్ప అట్టే ప్రశ్నించరాదని!

ఇలాంటి మహానుభావులు రాజకీయాల్లోనూ దండిగా దొరుకుతారు. మన పుణ్యభూమి అదృష్టం అదేమరి! ఈ మధ్య పొరుగు రాజ్యం చక్రవర్తి మన రాజ్యానికొచ్చి వెళ్లేరు. అందరితో మాటమంతీ జరిపేరు. ఊరికే పోట్లాడితే వచ్చేదేముంది బూడిద. ఇకపై పోట్లాడకుండా బుద్ధిగా బతుకుదాం అంటూ ప్రతిపాదించారు. మన చక్రవర్తి అందుకు సై అన్నారు. మీ రాజ్యంలో మేము, మా రాజ్యంలో మీరు వ్యాపారం చేసుకొందామని అంగీకరించేసారు. రెండు రాజ్యాల మధ్య మూతబడిన దారుల్ని తెరిచేద్దామని నిర్ణయించేసేరు. వేలమంది ప్రాణాలు హరీ అన్నాయి. వేల కోట్లు నష్టం జరిగింది... ఇప్పటికైనా చక్రవర్తులు శాంతి ఒప్పందం చేసుకొన్నందుకు ఉభయరాజ్యాల జనం ఖుషీ ఖుషీ అయిపొయ్యేరు. పొరుగురాజ్యంతో ఆడిన పుల్లలాటలో ఘోరంగా ఓడిపోయినా మన జనం పెద్దగా పట్టించుకోలేదు. ఆటదేముంది పోతేపోయింది. శాంతి ముఖ్యం. శాంతి ఉంటే అదే పదివేలంటూ జనం మురిసిపోయారు. ఐదు దశాబ్దాల అనుభవం నేర్పిన పాఠం అది. తేలిగ్గా తోసెయ్యడానికి వీలులేనిది.

పొరుగురాజ్యం చక్రవర్తి గతంలోనూ మనదేశం వచ్చేరు. హస్తినలో తాను పుట్టిన ఇల్లు చూసి పొంగిపోయేరు. ఆగ్రా వెళ్లి తాజ్‌మహల్‌ను చూసి తన్మయుడయ్యేరు. అంతా బాగానే ఉంది కాని... అప్పటి మన చక్రవర్తితో జరిపిన మాటామంతీ మాత్రం ఫలించలేదు. మతలబులు... మడతపేచీలు... పర్యవసానం మధ్యలోనే మంతనాలు ఖతం. పొరుగురాజ్యం చక్రవర్తి అర్థాంతరంగా గాలిమోటరు ఎక్కేసేరు. కొన్నేళ్లపాటు రెండు రాజ్యాల మధ్య ఎడమొహం పెడమొహంగా సాగింది. సడలిన ఆంక్షలు మళ్లీ షురూ.

సరే ఆ సంగతి అలా ఉంచుదాం. పొరుగురాజ్య చక్రవర్తి ఈ సారికూడా మనదేశపు పాత చక్రవర్తిని కలిసేరు. పాత చక్రవర్తి తబ్బిబ్బయ్యారు. లాహోర్‌లో తన కవితాగానాన్ని గుర్తు చేశారు. తన కవితే కదా ఈనాటి శుభ పరిణామాలకు మార్గం వేసింది అంటూ గొప్పగా విశ్లేషించేరు.

అలా తెల్లమొహాలేస్తారేం!...
ముందే మనవి చేసేనుగా...
'అన్నీ వేదాల్లోనే ఉన్నాయిష'
అనే మహానుభావులుంటారని! ❁

ఈ సంచికలో . . .

ఓరా!	5
కార్టూన్ కదంబం...	4
కవర్ స్టోరీ	6
ఇంతి సంగతులు	9
జీవనశైలి	10
బాలల కథ	11
బాలనేస్తాలు	12
కచేరి	17
ఆరోగ్యం	18
పుస్తక పరిచయం	21
న్యాయసలహాలు	24

ఇంకా...

నగరమా... నా ప్రియతమా!

కథ ... 14, 15,16



కమనీయ దృశ్యకావ్యం ఖండాలా

టూరిస్ట్‌గైడ్ . . . 21



జనక జజ్జుంత... తత!

కళాసాహితి . . . 22, 23

K.V.R. B.Com., B.L., (Director)

SPEAK ENGLISH FLUENTLY

తెలుగు తెలిస్తే చాలు...

మీరు ఇంట్లోనే ఉండి సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి!

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న ఇంగ్లీష్ కోర్సు మరి మీరూ...

స్టూడెంట్ అభిప్రాయం

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ ఫ్లూయెంట్‌గా మాట్లాడలేకపోయేవాడిని. నాకు ఒక మిత్రుని సలహా లభించి కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ తెప్పించి చదివాను. కేవలం ఒక్క నెలరోజుల్లోనే చక్కగా ఇంగ్లీష్ మాట్లాడగలుగుతున్నాను.

– జె.వి.రావు, విజయవాడ.

ఈ కోర్స్‌తో 25 గిఫ్ట్ పుస్తకాలు ఉచితం!

1. హిందీ స్పీకింగ్ కోర్సు 2. తమిళ స్పీకింగ్ కోర్సు 3. కన్నడ స్పీకింగ్ కోర్సు 4. మలయాళం స్పీకింగ్ కోర్సు – ఇలా 12 భారతీయ భాషలు (12 ఇన్ 1 పోకెట్ సైజులో) 1. ఇంగ్లీష్ డిక్షనరీ 2. వర్డ్ పవర్ 3. లెటర్ రైటింగ్ ప్రాక్టీస్ 4. వెర్బ్స్ డిక్షనరీ 5. సినానిమ్ & యాంటోనిమ్స్ డిక్షనరీ. (5 ఇన్ 1 పోకెట్ సైజులో) 1. ఈజీ మనీ ఎర్నింగ్ కోర్సు 2. సీక్రెట్ మ్యాజిక్ కోర్సు 3. జెంట్స్ స్మార్ట్‌నెస్ కోర్సు 4. బ్యూటీ ట్రీట్‌మెంట్ కోర్సు 5. సక్సెస్‌ఫుల్ ఎగ్జామినేషన్ కోర్సు 6. యోగా కోర్సు 7. పా 'మిస్టరీ' కోర్సు 8. కిచెన్ ట్రీట్‌మెంట్ కోర్సు. (8 ఇన్ 1 పోకెట్ సైజులో) గిఫ్ట్ పుస్తకాలు సైజు 9 cm X 11 cm లోపు. కోర్సు మెటీరియల్ సైజు 18cm x 24cm లోపు ఉంటాయి. * ఈ ఇంగ్లీష్ కోర్స్ తర్వాత మరో నాలుగు నెలల కోర్సు కూడా ఉంది. ఈ కోర్సులు అతి తక్కువ నియమిత నామమాత్రపు ఫీజుతో పంపుతాము. మీరు కావాలనుకుంటే పొందవచ్చు. తప్పకుండా తీసుకోవాలన్న ఎలాంటి నిబంధన లేదు.

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న ఇంగ్లీష్ కోర్సు



నెల్లూరులో ఒక్కరోజులో స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పించి రికార్డ్ సృష్టించిన ప్రోగ్రామ్‌లో కె.వి.ఆర్. ఇలాగే హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి, ఒంగోలు, కడప, ఏలూరు, చిత్తూరు, నల్గొండ, కర్నూలు తదితర పట్టణాల్లో కూడా నిర్వహించి రికార్డ్ సృష్టించారు.

ప్రక్కనవున్న కూపన్ పంపండి లేదా ఇంకా ఈజీ:

CHENNAI:
044-55519114.
0-9383302010.
0-9282107404.

చెన్నై ఫోన్ నెంబరుకు చేసినా తెలుగులోనే మాట్లాడతారు. యస్.టి.డి. చార్జీలు ఇప్పుడు నామమాత్రమే కనుక చెన్నైకి ఫోన్ చేసి కూడా మీ పూర్తి పేరు, ఇంటి నెం, ఊరి పేరు, పిన్‌కోడ్‌లతో వివరంగా మీ అడ్రసు తెలియజేసి కోర్సు పొందవచ్చును. పై నెంబర్లలో ఏ ఫోన్‌కు అయిన మీ అడ్రస్ చెప్పండి. కోర్స్ వి.పి.పి.లో పొందండి. ఇంకా ఆలస్యం ఎందుకు.... వెంటనే రింగ్ చేయండి.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

3249

SINCE 1990

KVR INSTITUTE
AWARD WINNER

ఉచితం! రూ.100/-లు విలువచేసే 'మెమరీ ఇంప్రూవ్‌మెంట్ కోర్సు' (సింపుల్ ఇంగ్లీష్‌లో)

No.76 (S), Habibullah Road, T.Nagar, Chennai - 17.

నాకు ఒక నెల కె.వి.ఆర్. ఇంగ్లీష్‌కోర్స్, అడిషనల్ బుక్స్, కోర్స్‌కు ఉపయోగపడే పేపర్ చార్ట్స్, 25 గిఫ్ట్‌పుస్తకాలు, 'కష్టమైన ఇంగ్లీషు - సులభమైన కిటుకులు' పోకెట్ సైజు పుస్తకం మరియు ఉచితంగా రూ.100/- లు విలువచేసే 'మెమరీ ఇంప్రూవ్‌మెంట్ కోర్సు' (సింపుల్ ఇంగ్లీష్‌లో) ఇవన్నీ మొత్తం కలిపి వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు మొత్తం రూ.441/-లు పైకం చెల్లించి పొకెట్ తీసుకుంటాను.

Name: ....
Address: ....
....
.... Pin Code: ☐☐☐☐☐☐

* SERVICE TAX INCLUDED

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **HYDERABAD:** Dilsukhnagar. Setwin Building, Opp: Venkatadri Theatre, Ph: 24141919, Cell:9848544519. **Ameerpet.** Dhanunjaya Chambers, Near: Saradhi Studio, Yousufguda Main Road, Ph: 30913546. **Uppal.** Above Bajaj Show Room, Jetta Mallaiah Complex, Ph: 27202461. ● **SECUNDERABAD:** # 110, College of Technology & Engineering Building, Opp: Hotel Abhiruchi, Paradise Circle, S.D.Road, Ph:55310532, Cell:98492 35031. ● **NELLORE:** D.No.17/704, Chakali Veedhi, V.R.College Centre. Ph:2342347. ● **CHITTOOR:** II Floor, M.B.R.Complex, D.I.Road, Ph: 229821. Cell: 9440078539. ● **NALGONDA:** Opp: Kanakadurga Temple, RAMAGIRI. Cell: 9440828540. ● **HANMAKONDA:** 2nd Floor, Beside: C.P. Reddy Complex, Main Road, Chowrasta. Ph: 2571905, Cell: 9849499920. ● **ANANTAPUR:** Opp: Srinivasa Tutorial, Near: Raviteja Hotel Lane, Kamala Nagar. Cell: 9440200216. ● **VIZIANAGARAM:** 2nd Floor, Fathima Plaza, Near: R.T.C. Complex, Ph: 551210.

పై కేంద్రాలలో ప్రత్యక్ష శిక్షణలో చేరే విద్యార్థులు ఫీజు చెల్లించిన వెంటనే స్పోకెన్ ఇంగ్లీష్ డైరెక్ట్ కోచింగ్ మెటీరియల్ 7 పుస్తకాలు + KVR ఫోల్డర్ ఫైల్ ఉచితంగా అడిగి తీసుకోండి.

కార్టూన్ కదంబం

నాడు:
నన్నాదుకో నన్నాదుకో...
ఇటే... ఇటే....
నేడు:
నావైపు చూడు నావైపు చూడు
రైతులకు దగ్గరవుదాం —టిడిపి

తీవ్రవాదులు
ముషారఫ్
భారత్‌పై ముషారఫ్ సానుకూల ధోరణి: ఆగ్రహించిన కాశ్మీర్ తీవ్రవాదులు

బిజెపిలో యువనాయకత్వానికి కొదువ లేదు: వాజ్‌పేయి
నారు

గుట్కా గేదె

ఈ రాంచీ గేదెగారు ప్రస్తుతం పలుపుతాడు తెంచుకుని వచ్చింది. గుట్కా తినే మహానుభావుడెవరన్నా కనబడకపోతాడా అని వీధులెమ్మట పడింది. 'నేరం నాదికాదు...నా యజమానిది...అంబా" అనంటోంది. జార్ఖండ్‌లోని రాంచీకి చెందిన మంగార్ మూండా పాలు పిండేముందు తన గేదెకు ఖైనీ(పొగాకు,సున్నం మిశ్రమం) తినిపించడం అలవాటు చేశాడు. రోజుకు ఆరుసార్లు గుట్కా నెమరువేయడం అలవాటు చేశాడు. ఏ రోజునన్నా తంబాకు రుచి అందలేదో...ఇక చూసుకోండి... మెడకేసిన పలుపు తెంపుకుంటోంది. గిరీశంగారు 'పొగ తాగనివాడు దున్నపోతై పుట్టున్' అన్నట్టుగా, ఏ గుట్కాభయ్యానో 'గుట్కా తిననివాడు గేదై పుట్టుగాక' అన్నాడేమో!? హతవిధీ!

సెల్‌ఫోన్‌లో లైబ్రరీ భవనం

చెవికి ఆనించు సెల్ ఎంతుంటుంది? మహా అయితే మన చెవికన్నా కొంచెం పెద్దదిగా ఉంటుందంతే కదా! అంతోటి ఫోన్‌లోనే ఓ బిల్డింగుడు పుస్తకాలు పట్టించి పెట్టారు మన జపానీయులు. ఈ మొబైల్ ఫోన్ కంపెనీతో అనేక వెబ్‌సైట్‌ల వారు వందలాది నవలలు, పురాణాలు, కథాసంకలనాలు, కవితలు, వ్యాసాలు సరఫరా చేస్తామంటూ ముందుకొస్తున్నారు. సెల్‌ఫోన్ నవలలు చిన్నచిన్న వాయిదాలలో డౌన్‌లోడ్ చేసుకుని చదువుకోవచ్చని 150 పుస్తకాలు కల సైట్ ఓనరు బాన్‌డాయ్ నెట్‌వర్క్ వారు, బన్‌కో యొమిహోదాయ్ వారు అంటున్నారు. సెల్‌లో మాట్లాడుకున్నంతసేపు మాట్లాడుకోవడం...ఆ తరువాత మనక్కావలసిన నవలో, కథాసంపుటియో సెలెక్ట్ చేసి క్లిక్‌మనిపించుకుని చదువుకోడమే మరి!



క్రికెట్టాభిమానం

జమ్‌షెడ్‌పూర్ కీనన్ స్టేడియంలో మూడవ వన్‌డే క్రికెట్ మ్యాచ్ సందర్భంగా ఓ క్రికెట్‌క్రీడ వీరాభిమాని "నా తల పరువు నిలపండో..." అని భారతటీమ్ ముందు గ్యాలరీలో అలంకృతుడయ్యాడు. ఎందుకంటే ఆ అభిమాని తన తలపై భారతదేశ మ్యాప్ ఆకారంలో జుట్టు షేవించుకున్నాడు. జుట్టు పోయినా...జట్టు వోడిపోయినా క్రీడాస్ఫూర్తితో పొరుగుదేశ హృదయాల్ని గెలుచుకున్నందుకు సంతోషించి ఉంటాడు కదా!

నవరత్నాల వారసత్వం ప్రకాశ్ కరత్

రంగురాళ్లను కూడా కొంతమంది రత్నాలుగా చెలామణీ చేస్తున్న రోజులివి. మెరిసే రంగురాళ్లన్నింటినీ రత్నాలనలేం. నిజమైన రత్నాలకు సానపెడితేనే వాటి విలువతెలిసేది. అలాగే కమ్యూనిస్టులలో అనేక మంది ప్రముఖులున్నారు. అందరికీ ఒకే తీరున గుర్తింపు రాదు. సానబట్టాలి. అలాంటి వారిలో ఒకరు సిపిఎం నూతన సారథి ప్రకాశ్ కరత్.

ఎం.కోటేశ్వరరావు

దారి తప్పుతున్న దేశ కమ్యూనిస్టు ఉద్యమాన్ని సరైనదారిలో పెట్టి కమ్యూనిస్టుపార్టీ(మార్క్సిస్టు)గా 1964లో పునర్‌నిర్మాణం చేసిన నవరత్నాలుగా కార్యకర్తల నీరాజనాలందుకున్న నాయకులు సుందరయ్య, బసవపున్నయ్య, బిటి.రణదివే, ఏకె.గోపాలన్, నంబూద్రిపాద్, రామమూర్తి, ప్రమోద్‌దాస్‌గుప్త, జ్యోతిబసు, హరికిషన్‌సింగ్ సూర్జిత్. వీరు కేవలం సిపిఎం నాయకులుగానే కాదు. దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలుగా చరిత్రలో చోటు సంపాదించుకున్నవారు. నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పడిన సిపిఎం తొలి ప్రధాన కార్యదర్శి సుందరయ్య కాగా తరువాత నంబూద్రిపాద్, అనంతరం హరికిషన్‌సింగ్ సూర్జిత్ సారధ్యంలో నడిచింది. వారి వారసుడిగా ఈనెల రెండవ వారంలో జరిగిన సిపిఎం 18వ మహాసభలో ప్రకాశ్ కరత్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ప్రతి మహాసభ సందర్భంగా ఏదో ఒక అంశాన్ని బూతద్ధంలో చూపి తప్పుదారి పట్టించటం మీడియాకు ఒక అలవాటుగా మారింది. ఏ వంకా దొరకని వారు డొంకట్టుకు ఏడ్చారన్న సామెత తెలిసిందే. ఈసారి అదే జరిగింది. రాజకీయాలలో అది ఏ పార్టీ అయినా ప్రతి నాయకుడికి ఒక ముద్రవేసి అందుకు అనుగుణంగా తమ అభిప్రాయాలను పాఠకుల మెదళ్లలోకి చొప్పించేందుకు చేయి తిరిగిన పత్రికా రచయితలు ప్రయత్నించటం అనేకమంది విషయంలో చూశాం. ప్రకాశ్ విషయంలోనూ అదే చేశారు. ఆయన 'శుద్ధ కమ్యూనిస్టు' అని ఒకరంటే, 'అతివాది' అన్నది బృందగానం. అనేక మంది కమ్యూనిస్టులు దిగజారిపోయి జండాలు తిప్పివేసిన పూర్వరంగంలో ఒక నాయకుడిని ఇలా వర్ణించటం అంటే కమ్యూనిస్టుల పరిభాషలో నిజానికి అది ఉత్తమ ప్రశంస. మరోవిధంగా చెప్పాలంటే ఇతరులలో కమ్యూనిస్టులంటే పెడసరపు వ్యక్తులన్న దురభిప్రాయం కలిగించటానికి చేసే ప్రయత్నం కూడా ఉంది.

ఒక "యువతరంగం" ఎప్పటికీ యువతరమే

సిపిఎం పొడగిట్టని వారు దానిని ఒక 'వృద్ధుల పార్టీ ' అన్నారు. అందుకే సుందరయ్య చనిపోగానే ఇంకేముంది ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టుపార్టీ పని అయిపోయినట్లే అని కొందరు సంబరపడ్డారు. ఇప్పుడు 56 సంవత్సరాల ప్రకాశ్ కరత్‌ను నూతన కార్యదర్శిగా ఎన్నుకోగానే యువతరం పార్టీగా వర్ణించటం చూస్తున్నాం. నిజానికి సిపిఎం తొలి ప్రధాన కార్యదర్శి సుందరయ్య ఆ బాధ్యతను చేపట్టే నాటికి ఆయన వయస్సు 51 సంవత్సరాలే. అందువలన ప్రకాష్ కరత్ తక్కువ వయస్సున్న కార్యదర్శులలో రెండవ వ్యక్తి. రాజకీయాలలో 50-60 సంవత్సరాల మధ్య వయస్కులను యువకులుగా పరిగణించటం పరిపాటే. దానినే గీటురాయిగా తీసుకుంటే సిపిఎం ఇప్పుడే కాదు గతంలోనూ యువతరం ఉన్న పార్టీయే. అది ఏర్పడి 41సంవత్సరాలు. ఢిల్లీ సిపిఎం జాతీయ మహాసభకు హాజరైన 698 మంది ప్రతినిధులు, పరిశీలకులలో 60 ఏండ్ల లోపు వారు 507 మంది ఉన్నారు. అంతకు మించిన వయస్సున్న 191 మంది కూడా సిపిఎం ఏర్పడే నాటికి యువకులే అన్నది వేరే చెప్పాల్సిన పనిలేదు. ఇంకా చెప్పాలంటే సిపిఎం ఏర్పడక ముందు పార్టీలో సభ్యులుగా ఉన్నవారు కేవలం 151 మందే ఉన్నారు. అంటే 547 మంది పార్టీ వయస్సు కేవలం 41 సంవత్సరాలే. ఇంతటి అనుభవమూ, యువతరంతో నిండి, స్పష్టమైన దిశా నిర్దేశంతో కర్తవ్యాలను రూపొందించుకున్న సిపిఎం

"పాత నీరు వెళ్ళాకనే కొత్తనీరు వస్తుందంటారు, కానీ సిపియం పార్టీలో అలా జరగలేదు. పాత నీరు ఉండగానే కొత్త ప్రవాహం వచ్చి పడింది...ఇదే ధోరణితో కొనసాగుతారు కాబట్టి పార్టీ శ్రేణులు మరింత బలపడే అవకాశం కూడా లేకపోలేదు. ఇకమీదట సిపియంలో పాత నీరు, కొత్తనీరు పక్కపక్కనే కాకుండా, పాతనీరును అధిగమించి కొత్తనీరు ప్రవహిస్తుంది."

ఆంధ్రప్రభ 12వ తేదీ సంపాదకీయం

"సిపియంలో నవశకం. ఒకే పార్టీలో భార్యాభర్తలకు అత్యున్నత పదవీ బాధ్యతలు అప్పగించిన అసాధారణ సన్నివేశం ఇది. పొలిట్‌బ్యూరోలో మహిళలు లేని కొరత ఈ విధంగా తీరినట్టయింది. సుందరయ్యలాగే కారత్ కూడా నిరాడంబరుడు. ఎకె గోపాలన్, ఇఎంఎస్ నంబూద్రిపాద్‌ల ప్రభావం కూడ కారత్‌పై ప్రగాఢంగా ఉంది"

ఆంధ్రజ్యోతి 12వ తేదీ సంపాదకీయం

"సున్నితంగా, ఏకగ్రీవంగా పార్టీ ప్రధాన కార్యదర్శిగా ప్రకాశ్ కరత్ ఎన్నికవ్వడం కొత్తతరానికి నాయకత్వ బదిలీ లాంటిది. స్వాతంత్ర్యానంతరం జన్మించిన కొత్తతరానికి అత్యున్నత నాయకత్వ స్థానమివ్వడం 41 సంవత్సరాల చరిత్రలో ఇదే ప్రథమం."

THE HINDU 13వ తేదీ సంపాదకీయం

నూతన నాయకుడిగా ప్రకాష్ కరత్ పార్టీని కొత్తపుంతలు తొక్కించగలరన్న విశ్వాసం పార్టీలోని అన్ని వయస్సుల, తరగతుల వారిలో తొణికిసలాడటం సహజం. పార్టీకి దూరంగా ఉన్న ఇతరులలో కూడా అదే అభిప్రాయాలు వెలువడటం పార్టీ పట్ల కొత్తవారు మొగ్గు చూపుతున్నారనటానికి ఒక సూచికగా సిపిఎం వారితో పాటు ఇతర రాజకీయ పరిశీలకులు కూడా భావిస్తున్నారు. పరిమిత బలం కలిగిన ఢిల్లీ పరిసరాలనుండి భారీ సంఖ్యలో జనం తరలి వచ్చి బహిరంగసభలో పాల్గొనటం ఆ పార్టీ వారిని మరింత ఉత్సాహపరుస్తోంది. అలాంటి ఉత్సాహభరిత వాతావరణంలో నూతన నాయకుడి గురించి తెలుసుకోవటం ఎవరికైనా ఆసక్తి కలిగించే విషయమే. ఆలస్యమెందుకు పదండి ముందుకు.

కరత్ ప్రకాశించిందిలా...

ప్రకాశ్ తండ్రి బ్రిటీష్ రైల్వే ఉద్యోగిగా మియన్మార్(గతంలో బర్మా అని పిలిచేవారు) వెళ్ళారు. ప్రకాశ్ 13వ ఏటనే ఆయన మరణించారు. దానితో కుటుంబంతో మద్రాస్‌కు వచ్చిన ప్రకాశ్ స్కూలు, కళాశాల విద్యను అక్కడే అభ్యసించారు. క్రిస్టియన్ కాలేజీలో అన్ని రంగాలలో చూపిన ప్రతిభకు బంగారు పతకం పొందారు. తరువాత బ్రిటన్‌లోని ఎడింబరో విశ్వవిద్యాలయంలో రాజకీయశాస్త్రం చదివేందుకు వెళ్ళారు. ప్రకాశ్ సహజంగానే నాటి రాజకీయపరిణామాలతో ప్రభావితుడై జాత్యహంకారానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో పాల్గొన్నారు. దాంతో ఆయనను 1970లో విశ్వవిద్యాలయం నుండి బహిష్కరించే ప్రయత్నం చేశారు. ఆయన ప్రవర్తనలో ఇతరత్రా ఎలాంటి మచ్చలేకపోవటంతో తిరిగి ప్రవేశం కల్పించారు. అక్కడ విద్య పూర్తయిన తరువాత అదే ఏడాది సిపిఎం సభ్యుడై, ఢిల్లీ వచ్చారు. రెండు సంవత్సరాల పాటు ఎకె.గోపాలన్‌కు సహాయకుడిగా పని చేశారు. తరువాత జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో చేరారు. విద్యార్థి యూనియన్ అధ్యక్షుడిగా(1972-73) ఎన్నికయ్యారు. మరుసటి ఏడాది భారత విద్యార్థి ఫెడరేషన్ అధ్యక్షుడిగా ఎన్నికై ఐదేండ్ల పాటు అనేక రాష్ట్రాలు పర్యటించారు. ఎమర్జన్సీలో ఏడాదిన్నరపాటు రహస్య జీవితం గడిపారు. ఉద్యమ సహచరిగా ఉన్న బృందాకరత్‌ను ఈ సమయంలోనే వివాహమాడారు. తరువాత 1982లో ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శిగా, 1985లో కేంద్రకమిటీ సభ్యుడిగా, 1992 పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆయన అనేక గ్రంథాలకు సంపాదకుడిగా పని చేశారు. మార్క్సిస్టు అనే త్రైమాసిక పత్రిక సంపాదకుడిగా, లెఫ్ట్ వర్డ్ అనే పుస్తక ప్రచురణ సంస్థ మేనేజింగ్‌డైరెక్టర్‌గా కూడా ఉన్నారు. ఆంగ్లం, తమిళం, మళయాళం, హిందీ భాషలలో ఉపన్యాసకుడిగా చిరపరిచితులు. ★

★ చదువులో మంచి విద్యార్థిగా ఉన్న మీరు విప్లవ రాజకీయాలవైపు ఎలా ఆకర్షితులయ్యారు?

విప్లవ రాజకీయాల్లోకి రావటానికి కార్యాచరణ కంటే సైద్ధాంతిక అవగాహనే ప్రధాన పాత్ర పోషించింది. కాలేజీ విద్యార్థిగా ఉన్న నాపై నంబూద్రిపాద్ రాసిన "కేరళ నిన్న నేడు రేపు" అన్న పుస్తకం చెరగని ముద్ర వేసింది. వివిధ జాతీయ, అంతర్జాతీయ ప్రభావాలు కూడా వామపక్ష రాజకీయాలవైపు మొగ్గటానికి దారితీశాయి. సైద్ధాంతిక పటిమ ఇ.ఎం.ఎస్ నంబూద్రిపాద్ నుండి, వ్యక్తిగత క్రమశిక్షణ, నడవడిక పుచ్చలపల్లి సుందరయ్య నుండి నేర్చుకున్నాను. నన్ను పూర్తికాలం పార్టీ కార్యకర్తగా రావాలని ప్రోత్సహించింది సుందరయ్యగారే.

★ మీ బాల్యం, కుటుంబం గురించి బయటకు తెలిసింది పరిమితమే, ఆ వివరాలు చెబుతారా?

స్వస్థలం కేరళలోని పాల్ఘాట్ జిల్లా. తండ్రి రైల్వే ఉద్యోగి. స్వాతంత్ర్యానికి ముందు ఆయన బర్మా రైల్వేలో పని చేయటానికి వెళ్లారు. దాదాపు పదేళ్లపాటు అక్కడే ఉన్నారు. కుటుంబంలో నేను రెండవ సంతానం. *1948*లో బర్మాలో పుట్టాను. బర్మాలో పెద్ద ఎత్తున తిరుగుబాటు ఉద్యమాలు సాగుతున్న కాలం అది. అటువంటి పరిస్థితుల్లో వలస కుటుంబాలకు భద్రత కరువవ్వటంతో మా తండ్రి ఆర్నెల్ల వయస్సున్న నన్ను, అమ్మను అక్కతోపాటు పాల్ఘాట్ పంపారు. ఐదేళ్ల వరకు అక్కడే ఉన్నాము. పరిస్థితులు కుదుటపడినతర్వాత తిరిగి రంగూన్ వెళ్లాము. నాకు తొమ్మిదో ఏడు వచ్చేవరకు రంగూన్‌లో ఉన్నాం. అప్పుడే మా అక్క చనిపోయింది. ఇక్కడ పరిస్థితులు కుటుంబానికి అనుకూలంగా లేవని భావించిన మా నాన్న మొత్తం కుటుంబాన్ని మద్రాస్‌కు మార్చారు. మద్రాస్‌లోకి క్రిస్టియన్ కళాశాలకు అనుబంధంగా ఉన్న పాఠశాల హాస్టల్లో ఉండి, *11*వ తరగతి వరకు చదివాను. నాకు *13* ఏళ్ల వయసులో మా నాన్న కూడా చనిపోయారు. దీంతో కుటుంబంలో ఇద్దరమే మిగిలాము. పాఠశాల విద్య తరువాత కళాశాల ఇచ్చిన స్కాలర్‌షిప్‌తో ప్రి యూనివర్శిటి విద్య (పియుసి) చదివాను. *1964*లో మొదటిసారిగా ఆసియాలో జపాన్ రాజధాని టోక్యోలో ఒలంపిక్స్ జరిగాయి. ఈ సందర్భంగా హిందూ దినపత్రిక, జపాన్‌కు చెందిన ప్రముఖ కంపెనీ ఒకటి కలిసి జాతీయ స్థాయిలో ఒలంపిక్ క్రీడలపై వ్యాసరచన పోటీ నిర్వహించింది. ఈ పోటీలో ప్రప్రథముడిగా వచ్చిన నన్ను హిందూ పత్రిక ఒలంపిక్స్ చూడటానికి పదిరోజుల పాటు జపాన్ పంపింది. అప్పటికే కళాశాల స్థాయిలో వివిధ క్రీడల్లో కూడా చురుకుగా పాల్గొనేవాడిని. *1966*లో ఆర్థిక శాస్త్రం విద్యార్థిగా డిగ్రీలో చేరాను. అప్పటి నుండే విద్యార్థి సంఘం కార్యక్రమాల్లో పాల్గొనే వాడిని. *1968*లో కళాశాల స్థాయిలో బహుముఖ ప్రజ్ఞాశాలిగా మెడల్‌తో సత్కరించారు. *1966*లోనే మద్రాస్ క్రిస్టియన్ కళాశాల విద్యార్థుల కోసం ఒక పత్రికను ప్రారంభించింది. దానికి నన్ను ఎడిటర్‌గా పెట్టారు.. ఈ పత్రిక నిర్వహణ కోసం విద్యార్థుల నుండే చందాలు వసూలు చేసేవాళ్లం. ఆ విధంగా విద్యార్థుల కోసం, విద్యార్థులు నడిపిన మొదటి పత్రికగా దీన్ని చెప్పుకోవచ్చు. ఈ పత్రిక పేరు "మోటివేటర్". అంటే

"యుపిఏకి చెందిన ప్రముఖ మంత్రులు తమ సంప్రదింపులకు ఏచూరిని, ప్రజాసామాన్యం సిపియం ప్రధాన కార్యదర్శిగా 'ఆర్గనైజేషనల్ మేన్'ని ఎన్నుకున్నారు."
"యుపిఏ నాయకత్వంలో ప్రకాశ్ కరత్ ప్రభావం తిరుగులేనిది." -మిస్టర్ రైట్ ఫ్రం లెఫ్ట్,

Business Standard
12-4-05

"ప్రధాన కార్యదర్శిగా సూర్జిత్‌సింగ్ స్థానంలో ప్రకాశ్ కరత్ ఎన్నికవ్వడంతో సిపియం పార్టీలో నూతన తరానికి నాయకత్వస్థానం కల్పించినట్లయ్యింది. అంతేకాదు ఈ మార్పుతో పాటు 41సంవత్సరాల చరిత్రలో మొట్టమొదటి పొలిట్‌బ్యూరో మహిళగా ఆయన భార్య బృందాకరత్ ఎన్నికవ్వడం మరో విశేషం."

The Indian EXPRESS
12-4-05

"ఏవిధంగా చూసినా ప్రకాశ్ కరత్ విలక్షణమైనవారు. ఇఎమ్మెస్ నంబూద్రిపాద్ లాగా ప్రజానాయకుడు కాదు. హరికిషన్‌సింగ్ సూర్జిత్‌లాగా ఎన్నికల పొత్తులతో జాతీయస్థాయి సమన్వయ కర్త కాదు. పశ్చిమబెంగాల్, కేరళ లాంటి చోట్ల నుంచి వచ్చిన ఉద్దండుడూ కాదు. కార్మిక, రైతుసంఘాల నాయకుడు అంతకంటే కాదు. వీటన్నింటినీ మించి ఒక నిఖార్సయిన సంస్థాగత కార్యకర్తగా, సిద్ధాంతకర్తగా ప్రకాశ్ కరత్ సాటిలేని మేటి!"

THE TIMES OF INDIA
12-4-05

"సిపియంలో కొత్తరక్తం ఉరకలెత్తితే, బిజెపిలో నిల్వనీటి కంపు కొడుతోంది...సిపియం యాభై ఆరేళ్ల ప్రకాశ్ కరత్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోగలిగినప్పుడు, బిజెపికి అది ఎందుకు సాధ్యం కావడంలేదు.

ఆంధ్రభూమి
14వ తేదీ సంపాదకీయం

ప్రోత్సాహకుడు. ఈ పత్రిక అవసరాలు కోసం పని చేయటం ప్రారంభించిన తర్వాత నా మనసు రాజకీయాల వైపు మళ్లింది. ఆ కాలంలో మద్రాసు పర్యటించే వివిధ రాజకీయ నాయకులను ఇంటర్వ్యూ చేసేవాడిని. దీంతో రాజకీయాలు, పార్టీలు, వ్యక్తులు తదితర అంశాల గురించి ఆలోచించటం ప్రారంభించాను. ఈ సమయంలోనే జరిగిన వియత్నాం యుద్ధం అంతర్జాతీయంగా పలువురు యువతీయువకులకు రాజకీయ దిశ నిర్దేశించుకునేందుకు కీలక సాధనంగా పని చేసింది. ఈ యుద్ధంలో అమెరికా అనుసరించిన క్రూరత్వం, దానికి వ్యతిరేకంగా దేశంలో కొనసాగిన ఉద్యమం నా రాజకీయ ఆలోచనలు వికసించేందుకు తోడ్పడింది. దీంతో పాటు మొదటిసారి దేశవ్యాప్తంగా యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాలు ఏర్పడిన కాలం అది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ గుత్తాధిపత్యానికి గండిపడింది. బెంగాల్, కేరళలలో వామపక్షాలు సంకీర్ణ ప్రభుత్వాలకు నాయకత్వం వహించాయి. ఈ పరిణామాలు నన్ను పెద్దఎత్తున ప్రభావితం చేశాయి. సాధారణ వామపక్షవాదిగా ఉన్న నన్ను ఈ రెండు పరిణామాలు వామపక్ష సానుభూతిపరునిగా మార్చాయి.

★ మీరు ఎడింబరో ఎలా వెళ్లారు?

మద్రాస్ క్రిస్టియన్ కళాశాలలో నన్ను అభిమానించే ప్రొఫెసర్ ఒకరు నేను బ్రిటన్‌లో చదవాలని ఆకాంక్షించారు. ఎడింబరో విశ్వవిద్యాలయం నుండి అప్లికేషన్లు తెప్పించి ఇచ్చారు. ఇంటర్వ్యూలో ప్రథముడిగా రావటంతో అక్కడ కూడా విశ్వవిద్యాలయం స్కాలర్‌షిప్ ఇచ్చింది. రాజనీతి శాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ చేసే రోజుల్లోనే దక్షిణాఫ్రికాలో బ్రిటన్ జాతి వివక్ష పాలనకు వ్యతిరేకంగా అన్ని విశ్వవిద్యాలయాల విద్యార్థులు ఆందోళనలకు దిగారు.. ఈ సమయంలో బ్రిటన్‌కు చెందిన బహుళ జాతి కంపెనీ బర్క్‌లే బ్యాంకు ఉద్యోగులను చేర్చుకునేందుకు విశ్వవిద్యాలయంలోని ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజికి వచ్చింది.. బ్రిటన్ కంపెనీలు దక్షిణాఫ్రికాలో పెట్టుబడులు ఉపసంహరించుకోవాలన్నది జాతి వివక్ష వ్యతిరేక పోరాట నినాదంగా ఉంది. దీనికి ప్రభావితులైన విశ్వవిద్యాలయం విద్యార్థులు ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజిని ఆక్రమించుకుని తాము లోపల ఉండి బయట తాళాలు వేశారు. ఈ ఆందోళన రెండురోజుల పాటు జరిగింది. తర్వాత పోలీసుల సహాయంతో తలుపులు తీసి అందరినీ అరెస్టు చేశారు. ఈ ఆందోళన తప్పు మరేవిధంగాను క్రమశిక్షణను ఉల్లంఘించని నన్ను విశ్వవిద్యాలయం యాజమాన్యం హెచ్చరించింది. మరోసారి ఇటువంటి తప్పు జరిగితే విశ్వవిద్యాలయం నుండి బర్తరఫ్ చేస్తామని హెచ్చరించారు. దీంతో అక్కడ ఉన్నత చదువులు కొనసాగించాలన్న ఆలోచనలకు స్వస్తి చెప్పాను. అక్కడే మాస్టర్స్ డిగ్రీ కోసం 'భారతదేశంలో భాష, జాతీయత, రాజకీయాలు' అన్న అంశంపై ఈ పరిశోధన పత్రం రూపొందించాను. దీనికోసం రెండునెలల పాటు భారతదేశంలో పర్యటించి వివిధ రాష్ట్రాల్లో భాష, జాతీయ ఉద్యమాలు గురించి అధ్యయనం చేశాను. ఈ సందర్భంగానే సిపిఎంతో పరిచయం ఏర్పడింది. అధ్యయనంలో భాగంగా పలువురు సీనియర్ పార్టీ నేతలను కూడా కలుసుకున్నాను. అప్పుడే సిపిఎంలో చేరి పని చేయాలని ప్రగాఢంగా నిర్ణయించుకున్నారు.

★ సుందరయ్యతో మీకు పరిచయం ఎలా జరిగింది?



అప్పట్లో పార్టీ ప్రధాన కార్యాలయం కలకత్తాలో ఉండేది. కార్యదర్శిగా సుందరయ్య అక్కడే ఉండేవారు. అయితే రెండు నెలలకొకసారి ఢిల్లీ వచ్చి పార్లమెంటరీ పార్టీ పని తీరు, హిందీ రాష్ట్రాల కమిటీలు పరిశీలన చేస్తుండేవారు. ఈ సమయంలో పార్లమెంటరీ పార్టీ ఆఫీసులో పని చేస్తున్న నన్ను ఆయన చూశారు. ఢిల్లీలో ఎ.కె.జి. నివాసంగా ఉన్న అశోక్ రోడ్‌లోని నాలుగో నంబరు క్వార్టర్ ఢిల్లీలో అన్ని ప్రజాసంఘాలకు, ఢిల్లీ పార్టీ రాష్ట్రశాఖకు, పార్లమెంటరీ ఆఫీసుకు వేదికగా ఉండేది. జెఎన్‌యు విద్యార్థిగా నేను సప్రూ హౌస్ హాస్టల్‌లో ఉండేవాడిని. రోజూ పార్టీ కార్యాలయానికి సైకిల్‌పై వచ్చేవాడిని. ఈ సమయంలోనే ఢిల్లీలో విద్యార్థి సంఘ రాజకీయాల్లో కూడా పాల్గొన్నాను. కొత్తగా ఏర్పడిన ఎస్ఎఫ్ఐలో బాధ్యతలు చేపట్టాను. ఉద్యమం కోసమే జెఎన్‌యు విద్యార్థి సంఘం ఎన్నికల్లో 1973లో పోటీచేసి గెలుపొందాను. 1974లో ఎస్ఎఫ్ఐ జాతీయ కార్యవర్గంలోకి అదే సంవత్సరం ఎస్ఎఫ్ఐ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టాను

★ బృంద మీ సహచరిగా ఎలా మారారు?

ఎస్ఎఫ్ఐ బాధ్యతల నిర్వహణలో భాగంగా తరచు కోల్‌కతా వెళుతుండేవాడిని. వెళ్లినప్పుడల్లా బిమన్ బసు నివాసం నాకు బస. దాని పక్కనే పార్టీ కార్యాలయం. అక్కడినుండే పీపుల్స్ డెమొక్రసీ పత్రిక వెలువడేది. అప్పటికే బృంద పత్రికలో పని చేస్తూండేవారు. మొదటిసారి ఆమెను అక్కడే చూశాను.. అనంతరం ఆమె కూడా పత్రికలో పని చేయటం ఇష్టం లేక ప్రజా సంఘాల్లో పనిచేయాలని భావిస్తున్నట్లు పార్టీ దృష్టికి తేవటంతో, పార్టీ ఆమెను ఢిల్లీ పంపింది. బృంద క్రమంగా ఢిల్లీ వస్త్రపరిశ్రమ కార్మికుల నాయకురాలిగా ఎదిగారు. ఈ సమయంలోనే నేను అటు ఢిల్లీలో పార్టీ బాధ్యతలు కూడా చూస్తుండేవాడిని. క్రమంగా ఇరువురం కలిసి పనిచేయటం, ఒకరి గురించి మరొకరు తెలుసుకోవటానికి, తద్వారా జీవితం పంచుకోవాలని నిర్ణయించుకోవటానికి దారితీసింది. మా వివాహం ఎమర్జెన్సీ కాలంలో సుందరయ్య, ఎకెజి, సూర్జిత్‌ల సమక్షంలో జరిగింది.

★ ఎడింబరో నుండి వచ్చిన తరువాత ఏం చేశారు?

1969లో ఎడిన్‌బరోలో చదువు పూర్తి చేసి మద్రాస్ వచ్చాను. అప్పట్లో మద్రాస్ కార్మికోద్యమ నేతగా ఉన్న వి.పి.చింతన్‌ను కలుసుకుని నా ఆలోచన వెల్లడించాను. స్థానికంగా పార్టీ కార్యక్రమాలలో పాల్గొనటం ప్రారంభించాను. అప్పట్లో విద్యార్థులుగా ఉన్న ఎన్.రామ్, మైథిలీ శివరామన్ వంటి కొద్దిమందితో కూడిన ఒక సన్నిహిత గ్రూపులో నిరంతరం రాజకీయ చర్చ నడుపుతూ ఉండేవాణ్ణి. ఈ గ్రూపు "రాడికల్ రివ్యూ" అనే పత్రికకూడా నడిపేది. అప్పట్లో మొదలైన ఎన్.రామ్‌తో స్నేహం ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే నాలుగైదు నెలలు నన్ను పరిశీలించిన తర్వాత పార్లమెంటరీ పార్టీ నేత ఎ.కె.గోపాలన్‌కు సహాయకారిగా పంపాలని పార్టీ నిర్ణయించింది. గోపాలన్‌ను పరిచయం చేయటానికి నన్ను ఒక రోజు రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆ రోజు గోపాలన్ మద్రాసు మీదుగా పాల్ఘాట్ వెళుతున్నారు. అక్కడిక్కడే తన తిరుగు ప్రయాణంలో ఢిల్లీ రావటానికి సిద్ధంగా ఉండాలని గోపాలన్ నన్ను కోరారు. బ్రిటన్ నుండి తిరిగి వచ్చాక ఏ ఉద్యోగం లేకుండా తిరగటం మా అమ్మకు నచ్చలేదు. నిజానికి నా రాజకీయ వ్యాపకాలు ఆమెకు తెలియదు. దాంతో ఉన్నట్లుండి

ఢిల్లీ ఎందుకని ప్రశ్నించిన తల్లిని సమాధానపర్చటానికి జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో పి.హెచ్‌డి చేయటానికి అని బదులిచ్చాను. ఆ విధంగా నేను జెఎన్‌యు విద్యార్థిగా మారాను.

ఇంటర్వ్యూ : కొండూరి వీరయ్య,
ప్రజాశక్తి ప్రతినిధి, ఢిల్లీ

ముహూర్తాలూ... ములక్కాడలూ

పి. జ్యోతి

ప్రియమైన శ్రీవారికి,

ఏమిటీ! లెటరు రాసింది అనుకుంటున్నారా! మరి ఏం చెప్పమంటారూ... ఈ ఫోన్‌ల గొడవ పెరిగాక, సెల్‌ఫోన్‌ల హోరు మితిమీరాక ఉత్తరాన్ని చూస్తే ఎవరికైనా చిత్తరంగానే ఉంటుంది మరి! కానీ ఉత్తరంలో ఉండే మహత్తరం ఇప్పుడు తెలియడం లేదు లేండి, మా అమ్మమ్మ నాడయితే ఎంత అపురూపమో. మా ఆఖరు పిన్ని పాతికేళ్ళ క్రితం అమెరికా వెళ్ళింది. అప్పుడు అక్కడి నుండి లెటర్స్ రాస్తే అవి మా అమ్మమ్మ చదువుకొని తన బట్టలపెట్టె అడుగున దాచుకుని అప్పుడప్పుడు అవి తీసి మళ్ళీ మళ్ళీ చదివి కాసేపు కన్నీళ్ళు పెట్టుకోవడం, కాసేపు ఆనందపడడం, వారు తన పక్కనే ఉన్నట్టు ఫీల్ కావడం... నాకిప్పటికీ జ్ఞాపకం. ఉత్తరాలు మనకొక అమూల్యమైన కానుకలు, తీపిగురుతులు. అంతెందుకు మీకో విషయం తెలియదు. మీరు మన పెళ్ళికి ముందు 'నిన్నే ప్రేమించా' 'నిన్నే పెళ్ళాడతా' నంటూ దొంగచాటుగా రాసిన ఉత్తరాలూ, ఇంకా పెళ్ళయిన తరువాత కొత్తమోజులో రాసిన ఉత్తరాలూ, ఆ తరువాత మన పెద్దది పుట్టినప్పుడు, బబ్లూగాడు పుట్టినపుడూ డెలివరికి పుట్టింటికెళితే విరహంతో వేగిపోయి మీరు రాసిన లేఖలూ నేను మన బీరువాలో నా బట్టల అడుగున ఎంత భద్రంగా దాచుకున్నానో తెలుసా. వాటిని మధ్యమధ్య బయటకు తీసి ఆనందంగా చదువుకుని మురిసిపోయి ఎంతగా మైమరచిపోతూ... ఉంటానో మీకు తెలియదు. మీకు, నేను ఇంకా చాలా విషయాలు రాయాలి. ఇవన్నీ ఫోన్‌లో అయితే లక్షల్లో బిల్లు వస్తుందని మీకు ఈ విధంగా లెటరు ద్వారా తెలియజేస్తున్నాను.

ఈ మధ్య నాకు మీ ప్రవర్తన చాలా చిరాకును కలిగిస్తోంది. ఎవరైనా ఏ గృహప్రవేశానికో, ఏ పెళ్ళికో, బారసాలకో ముహూర్తాలు చూసుకోవడం చూసాను. కానీ మీకు ఈ మధ్య ముహూర్తాలు - ములక్కాడల పిచ్చి బాగా ఎక్కువయిపోయింది. పెళ్ళికిముందులేని జబ్బు ఎలా అంటుకుందో తెలియడంలేదు. ప్రతీ చిన్న విషయానికీ ముహూర్తం చూడాలంటున్నారు. అంతేకాదు మీకు ఛాదస్తం బాగా పెరిగిపోయింది. రోజూ వెళ్ళే ఆఫీసుక్కూడా శకునాలు చూసుకుని మరీ వెడుతున్నారు. ఈ మధ్య ఎన్నిసార్లు శకునాలుచూసి బాగాలేదని ఆఫీసుకు ఎగనామం పెట్టారు. ఇంతెందుకూ నిన్నేమో పిల్లెదురొచ్చిందనీ, మొన్నేమో ఒంటి బ్రాహ్మణుడెదురొచ్చాడనీ... ఆ మొన్నేమో ఖాళీ బిందెతో ఎవరో ఎదురొచ్చారనీ ఇలా వారం బట్టి ఇంట్లోనే ఉన్నారు. ఆఖరుకు ఇంట్లో సరుకులు నిండుకున్నా కూడా వెళ్ళడం మానేశారు. ఇలాగయితే మనకు రోజులెలా గడుస్తాయి. అసలు మీరిలా ఆఫీసుకు ఎగనామం పెడితే ఎలా, అది ఆఫీసనుకున్నారా! అడివనుకున్నారా! మీ ఉద్యోగం ఉండాలా....ఊడాలనా... మీరిలా ఇంట్లో ఉంటే మీ బాస్... అదే ఆ మిడిగుడ్లేసుకుని ఆడాళ్ళు కనబడితే చాలు చిన్నపిల్లలు ఐస్‌క్రీమ్ కనబడితే చొంగ కార్చినట్టు చొంగ కారుస్తాడే, ఆడి నెత్తిమీద ఉన్న నాలుగు పోచలూ... కొబ్బరిపీచులా అయినా ఆడికి ఇంకా ఆడాళ్ళ యావే... ఆడి తలమీద అండమాన్ దీవే ఉంది. ఎప్పుడో సునామీ వాడి తలమీదే వస్తుంది ఇలా చేస్తే. ఇలాంటి వాళ్ళను ఊరికే వదలకూడదు. కళ్ళజోడు పీకేసి రుబ్బురోలు లో కసాపిసా దంచేసి పారేస్తే కంటిచూపుపోయి శాశ్వతంగా గుడ్డాళ్ళయి బుద్ధి తెచ్చుకుంటారు. మీరు ఆఫీసు కెళ్ళనప్పుడల్లా ఫోన్‌లు చేస్తాడా. ఆ ఫోన్‌లో మాత్రం మాటి మాటికీ ముందొక అమ్మ చివరొక అమ్మ చేర్చి మరీ మాట్లాడతాడు. "చెప్పేవి నీతులూ... తీసేవి గోతులూ". తింగరి సన్యాసి. ఆ ఫోన్ ఎప్పుడూ నేనే మాట్లాడాల్సి వస్తోంది. మీరేమో శకునం బాగా లేదని ఇంట్లో కూచోటమే కాకుండా, సత్యహరిశ్చంద్రుడి చెల్లినయిన నాతో అబ్బద్ధాలుకూడా చెప్పిస్తున్నారు. ఓ రోజు కాలిలో ముల్లుగుచ్చుకుందనీ, ఇంకోరోజేమో కంట్లో నలుసుపడిందనీ కారణాలు, చిన్నపిల్లలు స్కూలు ఎగ్గొట్టడానికి చెప్పే కారణాల్లా చెప్పీచెప్పీ ఇక చెప్పడానికి నాకే సిగ్గుగా ఉంది. మరి మీకెలా మనసొప్పుతోందో నాకు తెలియడంలా.

ఇహ మీ ప్రవర్తన భరించటం నా వల్ల కాదు. అందుకే పిల్లతో సహా నా క్లోజ్ ఫ్రెండ్ సుమ దగ్గరకొచ్చేశా. అది నన్ను ఎంతగానో అప్రిషియేట్ చేసింది. "ఆయనకు తెలిసిరావాలంటే ఇదే కరెక్ట్" అంది. చివరగా చెప్పేదేమిటంటే, మీ ఛాదస్తాలన్నీ వదులుకుని చక్కగా ఆఫీసుకు వెడతానంటేనే తిరిగి మీ వద్దకు వస్తాను లేదంటే, ఇక్కడే నాక్కూడా ఏదైనా పని చూస్తానంది సుమ. నాకు తెలుసు మీరు లెటరు పూర్తిగా చదవకుండానే నేను పక్కన లేననీ! విడిచివెళ్ళానన్న బెంగతో పసిపిల్లాడిలా వెక్కి వెక్కి ఏడ్చి మనసు మార్చుకుంటారనీ, నా కోసం పరుగున వస్తారనీ, అలా నీళ్ళు ధారాపాతంగా కారుతూ ఉండగానే రాకండి, కాస్త కళ్ళు తుడుచుకుని రండి, సరేనా!

మారిన మనిషిలా వచ్చే మీకోసం చూస్తూ ఉండే...

మీ

హృదయరాణి

వాణి



మీటింగ్స్... ఈటింగ్స్...

అంపశయ్య నవీన్

“ఈ మధ్య మీరు బొత్తిగా కనిపించడం లేదే?”

“ఇప్పుడైతే కనిపిస్తు న్నాను కదా...”

“ఇప్పుడు కనిపిస్తున్నారు లెండి... నా కళ్ళు సరిగ్గానే కనిపిస్తున్నాయి”

“మీకు కళ్ళు కనిపించడంలేదని ఎవరన్నారు ఇప్పుడైతే కనిపిస్తున్నాను కదా? అని అనడంలో ఉద్దేశ్యం?”

“ఏమో అనుకున్నాను... మీరు అసాధ్యులే...”

“సాధ్యున్నో అసాధ్యున్నో... ఆ విషయం వదిలేసి, అసలు విషయానికి రండి”

“అసలు విషయం మేమిటి?”

“మీరు కనిపించక పోవడమే... సాయంత్రంపూట మీతో కాసేపు కబుర్లు చెప్పుకుందామని వస్తే మీరసలు ఇంట్లో ఉండటమే లేదు. ఎక్కడికెళ్ళారంటే యేదో మీటింగుకెళ్ళారని మీ మిసెస్ చెప్పారు. ఎప్పుడడిగినా మీటింగులకెళ్ళారనే చెబుతున్నారు...”

“అవును... ఈ మధ్య మీటింగులు చాలా ఎక్కువగానే జరుగుతున్నాయి. ఎంత వద్దనుకున్నా వెళ్ళక తప్పడం లేదు”.

“వద్దని ఎందుకను కుంటున్నారు?”

“మీటింగులకెళ్ళడమనేది ఎప్పుడో ఒకసారైతే బాగానే ఉంటుంది. కానీ రెండ్రోజులకొకసారి మీటింగుల కెళ్ళమంటే అదో శిక్షలాగే ఉంటుంది”

“శిక్ష అంటున్నా రేమిటి? మీటింగులకెళ్ళడం శిక్షవుతుందా?”

“అవును మరి... వినడానికి ఓ శ్రోతలా వెళ్తే ఫరవాలేదు. ఎప్పుడు వినుగనిపిస్తే అప్పుడు వచ్చెయ్యొచ్చు. కానీ అధ్యక్షుడుగానో, ఉపన్యాసకుడిగానో వెళ్ళామనుకోండి... ఇరుక్కుపోయామన్నమాటే”

“అలా అంటారేమిటి? ఓ సభకు అధ్యక్షత వహించడమన్నా, ఓ సభలో ఉపన్యసించడమన్నా ఎంత గౌరవం... ఎంత గొప్ప...”

“అని మీరనుకుంటారు... కానీ సమస్యేమిటంటే ఏ మీటింగు కూడా ప్రకటించిన టైముకు మొదలు కాదు. ఓ గంటో, రెండుగంటలో ఆలస్యంగా ప్రారంభమౌతాయి. నాలాంటి కరెక్ట్ టైమ్‌కు వెళ్ళాలన్న పిచ్చున్నవాళ్ళు కొందరు టైమ్‌కే సమావేశస్థలానికి చేరుకుంటారు. అప్పటికింకా సమావేశ నిర్వాహకులు కూడా సమావేశ వేదిక దగ్గరకు చేరుకోరు. మీటింగ్ ఎప్పుడు ప్రారంభమౌతుందా అని మనం గంటలకు గంటలు వెయిట్ చెయ్యాలి. ఈ వెయిట్ చెయ్యడమన్నదే ఓ పెద్ద శిక్ష. రావలసిన వాళ్ళందరూ వచ్చాక సమావేశం



ప్రారంభమౌతుంది. వేదిక మీద ఓ పదిమందినో, పదిహేనుమందినో కూర్చోబెడ్తారు. సభాధ్యక్షుడు, ముఖ్యఅతిథి, విశిష్ట అతిథి, గౌరవ అతిథి, ఆత్మీయ అతిథి ఇలాంటి ఎంతోమంది అతిథులు వేదికమీద ఆసీనులౌతారు. తర్వాత అందరికీ బొకేలో, పూలదండలో ప్రదానం చేస్తారు. తర్వాత జ్యోతి ప్రజ్వలన, తర్వాత అతిథుల పరిచయం ఇవన్నీ పూర్తయ్యేటప్పటికి ఓ అరగంటో, గంటో గడిచిపోతుంది. తర్వాత అధ్యక్షుని తొలిపలుకులు, తర్వాత విశిష్ట అతిథి సందేశం. గౌరవ అతిథి సందేశం. అధ్యక్షుడు అందర్నీ సమయపాలన చెయ్యాలనీ, ఒక్కొక్కరూ ఐదునిమిషాలు మాత్రమే మాట్లాడాలని కోర్తాడు. కానీ ఎవ్వరూ ఆయన మాటల్ని సీరియస్‌గా తీసుకోరు. అరగంటకు తక్కువ ఎవ్వరూ మాట్లాడరు. మాట్లాడాల్సిన విషయాన్ని పక్కన పెట్టేసి ఏదేదో మాట్లాడుతుంటారు. జోక్స్ చెప్పినవ్విస్తుంటారు. పిట్టకథలు చెప్పి చప్పట్లు కొట్టించుకుంటారు. ముగ్గురు నల్గురు మాట్లాడగానే సభలో కూర్చున్న శ్రోతలు లేచి వెళ్ళిపోవడం మొదలెడ్తారు. నాలాంటి సమయపాలన చేసేవాడు, విషయానికి కట్టుబడి ఉండేవాడ్ని మాట్లాడమని అధ్యక్షులవారు పిలిచేటప్పటికి సభలోంచి సగంమంది వెళ్ళిపోతారు. చివరికి ముఖ్యఅతిథిగారో గంటసేపు మాట్లాడ్తాడు. ఆ తర్వాత వేదిక మీదున్న వాళ్ళందరికీ సన్మానాలు, శాలువాలు కప్పడం, జ్ఞాపికల్ని అందజేయడం. నిర్వాహకులకు దగ్గరివాళ్ళు కొందరు సభలో ఉంటారు. వాళ్ళకూ సన్మానాలు... వాళ్ళకూ జ్ఞాపికలు. చివరకు వందన సమర్పణ... వందన సమర్పణ చెయ్యడానికొచ్చినాయన కూడా ఓ పెద్ద ఉపన్యాసం చేస్తాడు. వేదిక మీద ఉన్న వాళ్ళందర్నీ తెగ పొగిడేసి, ఒక్కొక్కరికీ కృతజ్ఞతాభివందనాలు చెబుతాడు. ఓ పదినిముషాలు మాట్లాడడానికి వెళ్ళి నాలాంటివాడు ఈ తతంగా న్నంతా కిమ్మనకుండా అనుభవించడం శిక్షకాక మరేమౌతుంది చెప్పండి?”

“ఇంత శిక్షననుభవించే బదులు ఇలాంటి సమావేశాలకు మీలాంటి వాళ్ళు వెళ్ళకపోతే యేం?”

“రానని నిర్మోహ మాటంగా చెప్పెయ్యొచ్చు. కానీ వాళ్ళేమనుకుంటారోనని బాధపడటం, ఈయన మీది గౌరవంతో సమావేశానికి పిలిస్తే రానంటున్నాడనీ, ఈయనకు ఫోజెక్కువైందని ప్రచారం చేస్తారేమోనని ఆందోళన ఇలాంటి కొన్ని కారణాల వల్ల కొన్ని మీటింగులకెళ్ళాక తప్పడంలేదు. వెళ్ళి బాధపడకా తప్పడం లేదు అందుకే మీటింగ్స్ మీటింగ్స్‌లా ఉండాలి. కానీ టైమ్ ఈటింగ్‌లా... ఓపిక మెల్టింగ్‌లా ఉండకూడదు.”

★

స్వామివారి దోపిడీ

పి.ఎం.సుందరరావు

రుద్రవరం గ్రామంలో పేరయ్యశెట్టి కిరాణా దుకాణం నడుపుతున్నాడు. గిరాకీ ఎక్కువగా వస్తుండటంతో సంపాదనా బాగానే వుంది. సంపాదన పెరిగే కొద్దీ పేరయ్యశెట్టిలో ఆశ కూడా ఎక్కువైంది. ఇంకా ఎక్కువ సంపాదించాలనుకున్నాడు. దురాశతో వడ్డీ వ్యాపారం మొదలు పెట్టాడు.

ఊళ్లో అవసరం వున్న వారందరూ తమ విలువైన వస్తువులను, పొలాలను పేరయ్యశెట్టి దగ్గర తాకట్టుపెట్టి డబ్బు తీసుకుంటున్నారు. ఈ విధంగా కూడా బాగా సంపాదించాడు పేరయ్యశెట్టి. అయినా అతని ఆశ తీరలేదు.

ఒకసారి ఆ ఊరికి నిత్యానందులస్వామి వచ్చి ఊరి బయట వున్న సత్రంలో దిగారు. ఆ గ్రామంలోని కొంతమంది భక్తులు వెళ్లి స్వామిని దర్శించుకుని, తమ కోరికలు చెప్పకుని ఆయన అశీర్వాదం తీసుకోసాగారు.



ఈ విషయం పేరయ్యశెట్టి చెవిన పడింది. స్వామివారు కరుణిస్తే ఎంతో మేలు జరుగుతుందని వాళ్లు చెప్పగా విన్నాడు. ఆ రోజు ఉదయాన్నే పేరయ్యశెట్టి వెళ్లి నిత్యానందుల స్వామి వారిని కలుసుకున్నాడు. భక్తులందరూ వెళ్లే వరకూ ఆగి_ "స్వామీ! ఇప్పటికే నేను కొంత ధనాన్ని సంపాదించాను. దానికి రెట్టింపు ధనం నంపాదించే మార్గం చెప్పండి" అని ప్రాధేయపడ్డాడు. నిత్యానందుల స్వామి కాసేపు కళ్లు మూసుకుని తెరిచి "ఈ రోజు రాత్రి బాగా పొద్దు పోయిన తరువాత నేను, నా ఇద్దరు శిష్యులు మీ ఇంటికి వస్తాం. ప్రత్యేక పూజలు చేసి విభూది ఇస్తాను. రేపటి నుండి నీకు ధనం కోకొల్లలుగా వస్తుంది. వెళ్లి పూజకు ఏర్పాట్లు చేసుకో" అని చెప్పాడు. ఆ మాటలు విన్న పేరయ్య శెట్టి స్వామి వారికి నమస్కరించి, ఇంటికి వచ్చి భార్యకు విషయం చెప్పాడు. ఏర్పాట్లు చూడమన్నాడు. ఆమె "ఏమండీ! కొంత మంది దొంగస్వాములుంటారు. ఎవరినీ అంత తొందరగా నమ్మకూడదు. ఇలాంటి విషయాల్లో జాగ్రత్తగా వుండాలి. మెరిసేదంతా బంగారం కాదు" అని చెప్పింది. భార్య మాటలు ఏ మాత్రం పట్టించుకోలేదు పేరయ్యశెట్టి.

రాత్రయింది. నిత్యానందుల స్వామి తన ఇద్దరు శిష్యులతో కలిసి వచ్చారు. పేరయ్యశెట్టి వారిని సాదరంగా ఆహ్వానించి పూజ చేయమన్నాడు. ఆ ఇంట్లో పేరయ్య శెట్టి ఆయన భార్య ఇద్దరే వున్నారు. స్వామి వారు కాసేపు ఏవేవో చదివి, భార్యాభర్తలపై విభూది చల్లారు. అంతే కాసేపటికి వాళ్లిద్దరూ స్పృహ తప్పి పడిపోయారు. నిత్యానందుల స్వామి, శిష్యులు ఇంట్లో వున్న మొత్తం ధనాన్ని, నగలను తీసి మూటగట్టుకుని ఊరు విడిచి వెళ్లి పోయారు. కాసేపటికి భార్యాభర్తలు కళ్లు తెరిచి ఇల్లంతా కలియచూశారు. దొంగ స్వామి ఇద్దరు శిష్యులతో కలిసి ఇల్లంతా గుల్ల చేశారని తెలుసుకుని లబోదిబోమన్నారు. కానీ ఏం లాభం? పోయిన డబ్బు, నగలు తిరిగి రావుకదా..!

ఇంత జరిగినా ఇరుగుపొరుగు ఒక్కరుకూడా పేరయ్యశెట్టి ఇంటికి వచ్చి పరామర్శించలేదు. సరికదా పిసినారి, దురాశాపరుడు అయిన పేరయ్యశెట్టికి మంచి శాస్తి జరిగిందని లోలోన సంతోషించారు.

ఈ సంఘటనతో పేరయ్యశెట్టికి జ్ఞానోదయం అయ్యింది. ఇరుగుపొరుగుతో మంచిగా లేకపోతే ఎంత నష్టం వాటిల్లినా పలుకరించే దిక్కే వుండరని తెలుసుకున్నాడు. ఇంకెప్పుడూ అధిక వడ్డీలకు అప్పులు ఇవ్వకూడదని, పేదవారిని పీడించకూడదని నిర్ణయించుకున్నాడు. నలుగురితో మంచిగా వుంటూ చిన్న వ్యాపారం మొదలెట్టాడు.

బొమ్మలు గీద్దాం



1. ముందుగా రెండు కోడిగుడ్లు గియ్యాలి. ఒకటి పెద్దది. మరొకటి చిన్నది.
2. చెవుల స్థానంలో మరో రెండు సగం కోడి గుడ్లు గియ్యాలి.
3. ఆ చెవుల్లో రెండు బుల్లి సున్నాలు చుట్టండి. ముక్కు కూడా తగిలించండి.
4. కళ్లు, నోరు గియ్యండి. ఇహ చివరగా దానికి రంగులు అద్దండి. అంతే బుజ్జి ఎలుగుబంటి బొమ్మ రడీ.

వి'చిత్రం'

హాయ్ చిన్నారులూ! పక్కన ఓ జంతువు బొమ్మ వుంది కదా. అదేంటో కనిపెట్టేశారా! అయినా మీరు పిడుగులు కదా. మీకు తెలియకుండా ఎలా వుంటుందిలే. అన్నట్టు అసలు విషయం ఏంటంటే... ఆ జంతువు బొమ్మకో ప్రత్యేకత వుంది. అదేంటో మీరే చెప్పాలి. అప్పడే మీరు అసలైన పిడుగులవుతారు. ఏంటీ? దాంట్లో ప్రత్యేకంగా ఏమీ కనిపించడంలేదా! అన్ని జంతువులకు మల్లే ఇదికూడా గడ్డిపరకలు కొరుకుతోందా. అంతేనా? అర్రే నేస్తాలూ... మీరు చూసుకోలేదుకానీ అందులో ఓ వింత విషయం వుందర్రా. కావాలంటే జవాబు చూడండి.

జవాబు : బుజ్జాయిలూ... మీరేమన్నారు! పక్కన వున్న జంతువు బొమ్మలో ఏం విశేషం లేదనేకదా. కానీ అందులో ఒక మనిషి తల వుంది. కావాలంటే ఆ బొమ్మను తిరగేసి చూడండి. మీకు ఆ శ్రమ ఎందుకులే అని తిరగేసిన బొమ్మను కుడిచేతివైపున ఇచ్చాం. చూడండి మరి. కనిపించాడా. ఆ జంతువు చెవి ఈ వ్యక్తి గడ్డంలా, కన్ను మనిషి కన్నుగా వచ్చిందికదూ. కాకపోతే జంతువు మూతి మాత్రం మంకీ క్యాప్‌లా వచ్చింది. అంతేనా! మరి బావుందా జంతువుమనిషి బొమ్మ. ఈసారి నుంచి ఏం చేస్తారంటే ఇలాంటి బొమ్మలు ఇచ్చినప్పడు జాగ్రత్తగా అంగుళం అంగుళం పరిశీలించండి. పుస్తకాన్ని అటు, ఇటు తిప్పి చూడండి. ఆ తర్వాతే మేం ఇచ్చే జవాబు చూడండి. ఒకేనా!



అబ్బో! ఎన్ని ఆటవస్తువులో!!

చిన్నారులూ! వేసవి సెలవులుకదా. ఇప్పడు మీ ఆలోచనంతా 'ఏ ఆట ఆడాలబ్బా! అసలు బోలెడన్ని ఆట వస్తువులు వుంటే ఎంత బావుండేది' అనే కదా.

మీ మనసులోని మాట మాకు తెలిసిపోయిందిగా. అన్నట్టు మాకే కాదు ఆర్టిస్టు అంకుల్‌కి కూడా అర్థమైపోయినట్టుంది. అందుకే మీకోసం ఓ బొమ్మ వేసి పంపారు. ఇందులో బోలెడన్ని ఆటవస్తువులు వున్నాయి. ఆయనేమంటారంటే... ఆ బొమ్మలో వున్న ఆటవస్తువుల సంఖ్యను మీరు ఇట్టే కనిపెట్టెయ్యాలంట. మరి వెంటనే ఒక పెన్నో పెన్సిలో తీసుకుని లెక్కించండి.

జవాబు: మొత్తం తొమ్మిది ఆటవస్తువులున్నాయి. అవేంటంటే... క్రికెట్, టెన్నిస్, ఆర్చరీ, టేబుల్ టెన్నిస్, గోల్ఫ్, హాకీ, డార్ట్స్, బేస్‌బాల్, క్రోకెట్.

పువ్వును చేరాలంటే...

సీతాకోకచిలుకలకెప్పడూ చూపు అందమైన పువ్వులమీదే వుంటుంది కదా. ఇదిగో ఈ బొమ్మలో కనిపించే సీతాకోకచిలుకు కూడా అంతే. దానికి ఎప్పడెప్పడు ఆ పువ్వుమీద వాలదామా! ఎంత తొందరగా మకరందాన్ని తాగుదామా!! అని ఒకటే తొందరగా వుంది. కానీ పాపం పువ్వును చేరే దారే తెలీలా. అక్కడేమో మూడు దారులున్నాయి. ఏ దారిలోంచి వెళితే పువ్వులోస్తాయెూ తెలీక తెగ తికమక పడిపోతోందనుకోండి. మరి మీరైనా దానికి సాయం చెయ్యొచ్చుకదా.



బాలనేస్తాలు

రంగులు పులిమేద్దాం

పక్కన ఎవరున్నారో చెప్పకోండి చూద్దాం. ఆ... ఓ ముద్దులొలికే పిల్లి పిల్ల వుంది. దానికి వాళ్ల మామయ్య పిల్లి ఎంతో చక్కటి డ్రస్సు కొనిపించాడు. ఇదేమో అది వేసుకుని పెద్ద మీకు ఫోజు కొడుతోంది. కానీ అసలు విషయం ఏంటంటే... పిల్లిపిల్లకుగాని, అది వేసుకున్న డ్రస్సుకుగాని రంగులే లేవు. మీరేం చేయాలంటే... ఎంచక్కా రంగులు తీసుకుని అద్ది దానికంటే పెద్ద ఫోజు కొట్టాలి. సరేనా!



చిన్నారి చిత్రకారులు



తాళ్లూరి సుధాకర్, 7వ తరగతి, ఎస్ఎన్ఆర్ఎ బధిరుల పాఠశాల, నాగులపాలెం, పర్చూరు, ప్రకాశం.



తెల్లమేకల కిరణ్మయి, 5వ తరగతి, ఎస్ఎన్ఆర్ఎ బధిరుల పాఠశాల, నాగులపాలెం, పర్చూరు, ప్రకాశం.



గొర్రెపాటి అనిల్‌కుమార్, 5వ తరగతి, ఎస్ఎన్ఆర్ఎ బధిరుల పాఠశాల, నాగులపాలెం.

వీరి వీరి గుమ్మడిపండు...

వీరి పేరేమి?

సరైన సమాధానాలు రాసినవారు

యు.యు. బాబునరేంద్రప్రసాద్, 7వతరగతి, పి.విజయమాధవి, డి.రిహానాభాను, ఎ.సుమలత, ఎం.షబ్బీర్‌హుస్సేన్, కె.విజయ్‌కుమార్, యు.ఈరన్న, యు.రాజశేఖర్, కె.మజార్‌హుస్సేన్, బి.రవితేజయాదవ్, ఎం.అమరేష్, ఎం.బాలాజీ, 9వతరగతి, శ్రీవేణువిద్యాలయం, లక్ష్మీపేట, ఎమ్మిగనూరు. చలువాది అపర్ణ, 9వతరగతి, మధిర, ఖమ్మం. కాలువ శ్రీఅనూహ్య, 6వతరగతి, బ్రాడీపేట్, గుంటూరు. జె.ప్రసాద్‌రావు, మార్కాపూర్. ఎం.అశోక్‌కుమార్, 9వతరగతి, చిలుకూరు, నల్గొండ. కె.శ్రీకర్‌రెడ్డి, 5వతరగతి, సిద్ధార్థ స్కూల్, నిడమనూరు, నల్గొండ. ఎస్.శరత్‌చంద్ర, 8వతరగతి, న్యూసెంట్రల్ స్కూల్, శ్రీకాకుళం. ఎం.బి.పవన్, 8వతరగతి, నలంద విద్యానికేతన్, విజయవాడ. కె.భారతి, 8వతరగతి, ఒంగోలు పబ్లిక్ స్కూల్, ఒంగోలు. డి.శ్రావణి, 9వతరగతి, బుడమేరుకట్ట, విజయదుర్గానగర్. బి.దేవేంద్రకుమార్, 9వతరగతి, మధురానగర్, విజయవాడ. ఎ.అనూష, 9వతరగతి, కొబ్బరితోట, విజయవాడ. కె.సి.గణేష్, యుకెజి, కానూరు, విజయవాడ. కె.ఆర్.లోకేష్, 1వతరగతి, కానూరు, విజయవాడ. ఎన్.సుజన్, 3వతరగతి, గుంటూరు. వి.సతీష్, 6వతరగతి, నెహ్రూ కాన్వెంట్, కాకినాడ. జి.రమేష్, 9వతరగతి, పి.నానిబాబు, 8వతరగతి, కె.చంద్రారావు, 4వతరగతి, ఎ.లక్ష్మి 10వతరగతి, కాట్రేనికోన. జి.సాయిభరత్‌రెడ్డి, 6వతరగతి, మోదూకూరు, గుంటూరు. హెచ్.జాన్‌క్రిస్టోఫర్, 7వతరగతి, చీరాల, ప్రకాశం. ఎ.ప్రవీణ్‌రాజు, 8వతరగతి, చందోలు. జె.సాయిమనోహర్, 6వతరగతి, పాండురంగాపురం, ఖమ్మం. కె.రవికౌషిక్, 4వతరగతి, గుంటూరు. బి.యుగంధర్‌బాబు, 4వతరగతి, హస్తినాపురం, గుంటూరు. పి.అమర్ జయసింహా, గవరపాలెం, విశాఖ. డి.మహేష్‌కుమార్, 7వతరగతి, వికారాబాద్, రంగారెడ్డి. డి.సాయిసురేష్, హర్షిత, 7వతరగతి, మొయిద, విజయనగరం.

గతవారపు జవాబు
ప్రకాష్ కరత్

నగరమా... నా ప్రియతమా!

ఆర్. ప్రవీణ్‌కుమార్

ఔరంగాబాద్ వస్తే ఏం చూపిస్తావ్.. ఏం తినిపిస్తావ్'

'తాజ్ అఫ్ దక్కన్.. బీబీ కా మక్బారా చూయిస్తా. శ్రీఖండ్.. ద స్వీటెస్ట్ ఫుడ్ ఆఫ్ ఇండియా.. తినిపిస్తా'

తాను మాట్లాడే మాట ఏదైనా అర్థం కాదనిపిస్తే దానికి వివరణ జోడించడం సాగర్‌కు మొదటి నుంచీ అలవాటు.

'మరి, హైదరాబాదొస్తే..' అడిగాడు.

'చుక్కలు చూపిస్తా... తిట్లు తినిపిస్తా..'

'తిట్లా.. వామ్మో.. ఎందుకు?'

'లేకపోతే ఏంట్రా.. నువ్వు పుట్టి పెరిగిందిక్కడే. చదివి ఏడిచిందీ ఇక్కడే. నీకు ప్రపంచం పరిచయమైందీ ఇక్కడే. కొత్తగా అత్తింటికొస్తున్న అల్లుడిలా ఆ అడగడమేంటి?' అన్నాను మందలింపుగా.

ఒక్కసారిగా సాగర్ గొంతు మారింది. వెన్నెల్లో నన్నజాజుల పరిమళం మోసుకొస్తున్న మలయమారుతం ఒక్కసారిగా మోమును ముద్దాడిన తన్మయత్వం.. ఇష్టమైన వంటకం రుచిచూసినపుడు అర మూసిన కళ్లలో విరబూసే అమృతత్వం.. మంద్రమైన గొంతులో మరింత రసానుభూతిని పండిస్తోంది.

'ఎంతయినా శీనా... హైదరాబాద్ హైదరాబాదేరా... అందమైన రాకుమారి. కాలాన్ని గంటగంటకూ మోగించే సాలార్‌జంగ్ మ్యూజియంలోని పాతగడియారం, ఆకాశానికి వేలాడేసిన వెండి లాంతరు లాంటి బిర్లా టెంపుల్..' అంటూ ఆగి, 'హుస్సేన్ సాగర తీరం.. మది జిల్ అను మలయ సమీరం..' అంటూ పాటలోకి దిగాడు.

'నువ్వు పదేళ్లు వెనకబడి ఉన్నావ్... ఇప్పుడు చూస్తే తెలుస్తుంది' అన్నాను.

'తప్పకుండా వస్తాను. కానీ బాడ్మింటన్ టేబుల్ లాంటి నీ బట్టతల చూడ్డానికి మాత్రం కాదు. నా ప్రేయసి.. హైదరాబాద్‌ను చూడ్డానికి' అని అనడమే కాదు 'భాగమతీ ప్రేమ కథకి, బహుమతీ భాగ్యనగరం..' అంటూ మళ్లీ పాటలోకి దిగాడు.

'ఫర్వాలేదు.. మరాఠీ నేలపై తెలుగు పాటలు నాటుతున్నావన్నమాట..'

నవ్వాడు... ముత్యాలసరం తెగింది.

సాగర్ మొదటినుంచీ ప్రత్యేకమైన వ్యక్తి.

వాడూ, నేనూ కలిసి చదువుకున్నాం. ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీ నుంచి బస్టాప్ వరకూ నడుచుకుంటూ వస్తూ వరుసగా నిలబడిన చెట్లనుంచి కురిసిన పున్నాగ పూలను దోసిలి నిండా నింపుకుని వాసన చూస్తూ కవిత్వం చదవడం అలవాటు వాడికి. 'నీ పుస్తకాలు మోయలేక చస్తున్నా.. పైగా ఇదొకటా.. ప్లీజ్... నాకింకా బతకాలని ఉంది' అంటూ ఆటపట్టించేవాణ్ణి. శీతాకాలపు చలిరాత్రి స్వెట్టర్లో వెచ్చగా ఒదిగిపోతూ ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో ఇరానీ టీ తాగడం, ఆదివారాలు కోఠిలో పాత పుస్తకాల షాపుల చుట్టూ తిరగడం.. వీర సౌందర్య శోభిత శకుంతలారాణి కోసం పైకి నవ్వుతూనే త్యాగరాయ గానసభలో కర్ణాటక సంగీతాన్ని చెవులుమూసుకు వినడం, ఏడాదికోసారి హలీం, నెలకోసారి హైదరాబాదీ బిర్యానీ, వారానికోసారి తందూరీ రోటీలోకి అండాకర్రీ.. వీటన్నింటిలో వాడికి నేనే తోడు. మా నుంచి ఎవరూ వేరుచేయలేని అనుభూతులవి.

అల్కాయాజ్ఞిక్ పాట... ఉర్దూ ఘర్ ముషాయిరా.. రెండు రూపాయల బఠానీలు కొనుక్కుని ట్యాంక్‌బండ్ రెయిలింగ్‌పై వంగి హుస్సేన్‌సాగర్‌లోకి విసురుతూ గజల్ గీతం.. వాడికి హైదరాబాదంటే పిచ్చి ప్రేమ... ప్రాణం.

అప్పట్లో మా రూమ్‌లో గోడపై పక్కపక్కనే మీనాకుమారి, మధుబాల.. ఒకరు పదునైన షాంపేన్ నవ్వుతో గుండెను కోస్తుంటే, మరొకరు కళ్లతో పెదవికీ, హృదయానికీ అంటుకట్టేవారు. సాగర్ అభిరుచులు మాలో కొత్త ఉత్సాహాన్ని నింపేవి.. అడుగడుగునా వాడి మార్కు కనబడేది. ఇంగువ వాసనలా మాకూ కొంత అబ్బేవి.

చదువు పూర్తయ్యాక మరఠ్వాడా యూనివర్సిటీలో ఉద్యోగం రావడంతో సాగర్ ఔరంగాబాద్ వెళ్లిపోయాడు. అమ్మానాన్నలతో అక్కడే సెటిల్ అయ్యాడు. ఓ అడ్వర్టయిజింగ్ సంస్థను నిర్వహిస్తూ నేనుండిపోయాను. ఇందులేఖతో నా పెళ్లికి వచ్చిన సాగర్ పదేళ్లయినా మళ్లీ హైదరాబాద్ రాలేకపోయాడు. పెళ్లీ చేసుకోలేదు. వారానికోసారి ఇలా ఫోన్‌లో ఎదురుపడి గుండెలోని దిగులు చల్లార్చినట్లే చల్లార్చి, రెట్టింపు చేసి మాయమవుతాడు.

* * *

వారం రోజుల తర్వాత ఓ రోజు మధ్యాహ్నం.. నేనూ, మా ఆవిడా భోంచేస్తుండగానే దభేలున తలుపుతోసుకుని దిగాడు సాగర్.

'ఇదేనా రావడం' ఇద్దరం ఒకేసారి అడిగాం.

'అనుకోకుండా వచ్చేవాడు అతిథి. పిలిస్తే వచ్చేవాడు ఆహ్వానితుడు. అన్ని తలుపులు బిగించుకున్నా బద్దలుకొట్టుకు వచ్చేవాడే ఆత్మీయుడు.. నేను ఆత్మీయుణ్ణి అనుకున్నాను. అందుకే...' అంటూ చిరునవ్వు నవ్వాడు.

'ఇల్లు సులువుగానే దొరికిందా?' అడిగాను.

'ఊ.. చిక్కడపల్లి రెండో వీధి, మొదటి లేన్, నల్లగేటూ, నందివర్ధనం చెట్టూ.. ఇట్టే పట్టేసుకున్నా. అన్నట్టు ఈ టైములో భోజనాలేంట్రా' కుర్చీలో కూర్చుని షూ విప్పుతూ అడిగాడు.

'ప్రైమ్‌టైమ్‌లో అయితే తిండి దొరకదని...' అంటూ భయంగా మా ఆవిడ కేసి చూశాను.

'అదేమరి..' అంటూ కొరకొరా చూసింది.

ఇద్దరం ఒక్కసారిగా నవ్వాం.. తనూ గొంతు కలిపింది.

✻ ✻ ✻

మరుసటి రోజంతా స్కూటర్‌పై ఇద్దరం నగరంలో తిరిగాం. కాలేజీ రోజుల్లో సైకిల్‌పై 'డబుల్ సవారీ'తో సెకండ్‌షో సినిమాకు వెళ్లడం అలవాటే మాకు. 'ఇప్పుడు సైకిలెక్కితే బాగుండదు.. ఆటోలో వెళ్దాం' అన్నాను.

'వద్దులే.. స్కూటరుందిగా..' అన్నాడు. ఇద్దరం దానిపై బయల్దేరాం. నేను నడుపుతుంటే వాడు వెనక కూర్చున్నాడు.

ఆ సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై –

'పౌర్ణమి నాటి రాత్రి యమున ఒడ్డున నిలబడి తాజ్ అందాలను చూస్తూ ఒక కేరళ అమ్మాయి బెంగాలీ పొయిట్రీని, తెలుగు, లేదా ఉర్దూలో చెబుతుంటే శ్రీఖండ్ తింటూ వినాలనుంది... అంటాడో రచయిత. అంతటి సమైక్యమేక్యం.. ఎంతటి అదృష్టం..' అన్నాడు నా మౌనాన్ని కరిగిస్తూ.

'సాగర్ ఏదైనా చెప్పు..' అడిగాను.

తల వంచుకుని కాసేపు కళ్లు మూసుకున్నాడు.

'నువ్వెప్పుడొస్తావ్
రైలాగినప్పుడల్లా
రెండు ఒంటరి చందమామలు
నీ కోసమేగా వెతికేది
హృదయ పతాకాన్ని అరచేతిలోకి తీసుకుని
దూరమవుతున్న రైలు కేసి
ఊపీ.. ఊపీ..
ఒంటి చేత్తో నిన్ను సాగనంపిన జ్ఞాపకం
ఎన్ని చేతులు కలిసాయిక్కడ
ఎన్ని గుండెలు కరిగాయిక్కడ
నువ్వెప్పుడొస్తావ్ , ప్రియా !
రైలాగినప్పుడల్లా
ఇంకిన నా రెండు సముద్రాలు
నీ కోసమేగా వెతికేది'

'వావ్.. బ్యూటిఫుల్. నీదేనా ఈ కవిత'

'అవును.. ఇప్పుడే వస్తా ఇక్కడే ఉండు అంటూ వెళ్లిన వ్యక్తి కోసం 18 ఏళ్లపాటు ఎదురుచూపులో గడిపి బీహార్‌లోని ఓ రైల్వేస్టేషన్‌లో ప్రాణాలొదిలిన ప్రేమిక గురించి రాసింది.'

'నిజంగా అద్భుతం' అంటూ చప్పట్లు చరిచాను.

దూరంగా వాలిన పావురం ఒక్కసారిగా గాల్లోకి ఎగిరింది. నాకు తెలుసు, నాలుక మీద వాన చినుకును దాచుకోవడం తెలిసిన వాడికే కవిత్వాన్నీ, వెన్నెలనీ వర్ణించడం సాధ్యమవుతుందని.

'శీనూ.. డబుల్‌డెక్కర్ కనబడ్డం లేదేంటి?' అడిగాడు సాగర్.

'ఎవరూ సునీతా...'

'ఛ.. తను కాదురా, బస్‌లు..'

'ఓహ్.. అవా.. ఎప్పుడో పోయాయి.. ఫ్లైఓవర్లు వచ్చాయిగా..'

'ఒకప్పుడు లిబర్టీసెంటర్‌లో నిలబడితే హుస్సేన్‌సాగర్‌పై నుంచి నెలవంక తొంగిచూసేది. ఇప్పుడేంటి ఈ మొండి గోడలు?'

'నీకో విషయం తెలుసా.. ఫ్లైఓవర్ నడుము వంపు కోసం నగరంలోని చాలాచోట్ల మురికివాడల్ని ఖాళీ చేయించారు..'

'అవునా..'

'అంతేకాదు, తెలుగుతల్లి విగ్రహాన్నే తప్పించారు'

ఈసారి సాగర్ ఆశ్చర్యపోలేదు. మౌనంగా తలదించుకుని నేలకేసి చూస్తున్నాడు. కొంతసేపటి తర్వాత..

'వెళ్దామా..' అంటూ ముందుకు కదిలాను.

ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లాం.



హైదరాబాద్‌లో ఉంటున్నానన్న మాటేగానీ నేనూ చాలా రోజుల తర్వాత వచ్చాను. ఇప్పుడక్కడ పున్నాగ చెట్లులేవు. ఇనుప కంచె వెనక గడ్డి పరచుకుని ఉంది.

అక్కడే ఉన్న ఓ వ్యక్తిని పిలిచి అడిగాడు సాగర్, 'ఇక్కడ పున్నాగ చెట్లుండాలే'

'ఓ.. గప్పటిఎప్పటి ముచ్చటో.. పూలు పడి చెత్తచెత్తగా అవుతున్నయ్ అని యాడాది కిందట క్లీన్ అండ్ గ్రీన్‌ల కొట్టేయించిన్రు.. పదో పన్నెండో ఇంకుడుగుంతలు తవ్విన్రు.. ఇందులో పడి ఇద్దరు పోరలు కాళ్లిరగొట్టుకోంగనే మళ్లీ మూసేయించిన్రు. ఇప్పుడీడ గడ్డి పెంచుతున్నం..' అనేసి వెళ్లిపోయాడు. అర్థం కానట్టు నాకేసి చూశాడు సాగర్.

'సింపుల్.. ప్రభుత్వాలకూ ఫ్యాషన్‌లు అలవాటయితే ఇదిగో ఇలా..' అన్నాను.

ఇవతల సిమెంటు బెంచీపై కుర్చున్నాం.

'ఏరా మాట్లాడవే..'

'ఏమీ లేదు..' అన్నాడు కానీ, ఏదో ఉందని తెలుస్తూనే ఉంది. చేతులు కట్టుకుని బెంచీపై వెనక్కివాలి ఆకాశంకేసి చూస్తున్నాడు. నాకూ మాట్లాడాలనిపించలేదు.

✻ ✻ ✻

ఓ బద్ధకపు ఆదివారం నేను బెడ్‌పై ముసుగుతన్ని మాగన్నుగా కదులుతుంటే సాగర్ వచ్చాడు.

'ఎంట్రా ఏం కొంపలు మునిగిపోయాయి.. అప్పుడే లేచి రెడీ అయ్యావ్.. ఎక్కడికి సార్?'

'బషీర్‌బాగ్ వెళ్లాలి. పద లే..'

'బషీర్‌బాగా.... ఎందుకు స్వామీ..'

'షహీద్ చౌక్..... నువ్ లేచి రెడీ అవ్. పద... పదా' తొందరపెట్టాడు.

చౌరస్తాలోకి వెళ్లగానే లేత ఎండ ఇద్దరినీ చుట్టేసింది.

నాకంతా అర్థమయ్యీ, అర్థంకాకుండా ఉంది.

జేబులోంచి తీసిన ఓ కాగితాన్ని పరిచి, ఇంటి నుంచి వచ్చేప్పుడు ఎప్పుడు తెచ్చాడో.. ఓ పిడికెడు నందివర్ధనాలు అలా కుప్పగా పోశాడు.

'మీ త్యాగాన్ని స్మరిస్తూ తలలు అవనతాలవుతున్నాయి
మీ ఆశయం కోసం పిడికిళ్లు పైకి లేస్తున్నాయి..'

లేతకొబ్బరిలాంటి తెల్లకాగితంపై మొగలి పుప్పొడిలాంటి అక్షరాలు... బహుశా కవిత అనుకుంటా.. రెండులైన్లు మాత్రం కనిపించాయి.

నందివర్ధనాలను సిగన ధరించిన కవితాకన్యక.. పుష్పాంజలి అర్పిస్తే... ఎ ఫ్రాగ్రెన్స్ బిహైండ్ రిమెంబరెన్స్..

నాకు నోట మాటరాలేదు. సాగర్ మౌనంగా కళ్లు మూసుకున్నాడు. ఒళ్లంతా చురుకుపుట్టిస్తూ ఎండ ఇప్పుడు మాకు తలస్నానం చేయిస్తోంది.

✻ ✻ ✻

'హోటల్ చాంద్ కి తుకడా'

దానికీ మాకూ ఓ బలమైన అనుబంధముంది. అక్కడ ప్రతీ ఉదయం ఇరానీ టీ తాగితేగానీ తెల్లారినట్లుండేది కాదు. సాయంత్రం టీ తాగనిదే నిద్రపట్టేదీ కాదు. సాగర్ ఔరంగాబాద్ వెళ్లిపోయాక నెలకు నాలుగైదుసార్లు వెళ్లేవాణ్ని. టీ తాగడంకన్నా, చాంద్‌బాషాకు మొహం చూపించేందు కైనా వెళ్లక తప్పేదికాదు. చాంద్ ఆ హోటల్ ఓనరు.

సాగర్, నేనూ హోటల్‌కు వెళ్లేసరికి జనం తక్కువగానే ఉన్నారు. 'చాంద్ సాబ్.. కౌన్ ఆయా దేఖో..' అన్నాను కౌంటర్‌వైపు వినబడేలా.

నా వైపు చూసి, కొంచెం ముందుకు వంగి స్కూటర్ పార్క్ చేసి వస్తున్న సాగర్‌ని చూశాడు. చకచకా నడుచుకుంటూ వచ్చి 'హ్రే.. సాగర్ బేటే..' అంటూ వచ్చి కౌగిలించుకున్నాడు.

'ఎన్నాండ్లయింది నిన్ను చూసి..

ఎప్పుడొచ్చినవ్.. శీనూ కూడా ఏం చెప్పలే..' అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు.'రా.. రా కూర్చో..' అంటూ ఓ టేబుల్ దగ్గర కూర్చోబెట్టాడు. మూడు టీలు తెప్పించాడు.

'సాబ్‌జీ ఎలా ఉన్నారు?' ఆయన మొహంలోకి తదేకంగా చూస్తూ అడిగాడు సాగర్.

'నువ్వేలా ఉన్నావ్.. ఔరంగాబాద్‌తో ఠీకీ హైనా' పాన్‌పెదాలపై అదే చిరునవ్వు.

'బావున్నాను.. మీ సంగతి చెప్పండి?

'నేను బాగానే ఉన్నా. చాంద్ తో ఠీక్ హై.. లేకిన్ చాంద్ కి తుక్డా హీ...'

'ఏమైంది.. ఏమైంది హోటల్‌కి'

'ఇంకా ఏం కాలే. ఖల్ హో యా పర్సూమ్ తుక్డే తుక్డే కర్కేహీ వో లోగ్ చోడేగా' లేచి వెళ్లి పాన్ ఉమ్మేసి వచ్చాడు.

'అసలేమైంది.. శీనూ' నావైపు తిరిగాడు సాగర్.

'రోడ్ వైడెనింగ్ చేస్తున్నారు. ఇప్పుడున్న రోడ్లు ఇరుకుగా మారాయంట. ప్రపంచబ్యాంకు నిధులిచ్చింది. కొత్త రోడ్లేస్తారంట.. రోడ్డు మధ్య నుంచి 20మీటర్ల వరకూ కూలగొడ్తున్నారు. ఈ హోటల్ కూడా..'

చాంద్‌సాబ్ మాట్లాడుతూ 'ఏళ్లనుంచీ నడుస్తున్న హోటలాయె. పూరా ఘర్‌కో ఖానా దేతీ ఆ రహాహై.. హైదరాబాద్ గల్లీ గల్లీకి నేను తెలుసు. ఈ చౌరస్తాలో 'చాంద్ కా తుక్డా' అంటే బంగరుగుర్తు. అలాంటిది ఇప్పుడు సగానికి సగం మట్టి కొట్టుకుపోతది' బలహీనంగా అన్నాడు. ఆయన కళ్లలో మబ్బులు కమ్ముకున్నాయి. ఈసారి పాన్ నములుతుంటే దవడ నరాలు పైకి పొంగుతుండడం, పంటిబిగువులో తుపానుని పెదవిచాటున దాచేస్తున్నాడని స్పష్టంచేస్తోంది.

మా మధ్య అంతవరకూ ఉధృతంగా సాగిన మాటల ప్రవాహం ఆ తర్వాత వానపాములాంటి నీటి పాయలా మారింది– నిర్జరజరా.

అరగంట తర్వాత ఎవరో వస్తే చాంద్‌సాబ్ కౌంటర్ దగ్గరికి వెళ్లాడు. మేమూ వెళ్లడానికి లేచాం. ఒక అడుగు ముందుకేసిన వాడు కాస్తా ఏదో గుర్తొచ్చిన వాడిలా.. 'ఆగాగు' అంటూ పక్కటేబుల్ దగ్గరకు వెళ్లాడు. తన కళ్లద్దాలను సరి చేసుకుంటూ గోడకున్న ఓ వైట్ మార్బుల్ రాయిపై చూపుడు వేలు పెట్టి చూస్తున్నాడు. నేను వెనుదిరిగి సాగర్ కేసి చూశాను.

'శీనాయ్.. ఇటురా..' అంటూ ఉత్సాహంగా పిలిచాడు. నీటి తొట్టెలోంచి ఆర్కిమిడీస్ వేసిన 'యురేకా' కేక, వాడి కళ్లల్లో. నేను దగ్గరికి సమీపించగానే చూడమన్నట్లు సైగ చేశాడు. నేను ముందుకు వంగి చూస్తే... 'సాగర మధ్యగతే... జగతే..' పదేళ్ల క్రితం టీ తాగడానికొచ్చి ఓ రోజు ఆ మార్బుల్ రాయిపై మేం నెయిల్‌కటర్‌తో చెక్కిందది. ఇద్దరిలోనూ రెక్కలు తొడిగిన ఆనందం. ఉబ్బితబ్బిబ్బవుతూ సాగర్ వెంటనే ఓ కేకేశాడు. 'అరె ఛోటూ... ఏక్ వన్ బై టు చాయ్ లా'.



* * *

తర్వాత నాలుగు రోజులు హైదరాబాద్ అంతా చుట్టివచ్చాం. మాతో గడిపినా సాగర్‌లో ఎందుకో వచ్చినరోజునాటి ఉత్సాహం లేదు. ఐదోరోజు ఉదయం 'నంది ఎక్స్‌ప్రెస్'కు ఔరంగాబాద్ బయల్దేరాడు. నేనూ, మా ఆవిడా స్టేషన్‌కు వెళ్లి సెండాఫ్ ఇచ్చివచ్చాం. ఇంటికి రాగానే నాలుగు రోజుల సెలవుల తర్వాత ఆరోజు ఆఫీసుకు వెళ్లేందుకు ప్రిపేరవుతుండగా.. ఇందులేఖ హడావుడిగా వచ్చింది. 'ఏవండీ ఇది గదిలో దొరికింది. బహుశా సాగర్‌దేమో..' అంది.

దాన్ని వేగంగా అందుకుని తెరిచి చూశాను. డైరీలోంచి చించి నలిపేసిన లీగల్‌సైజు పేపరది. అక్షరాలను పోల్చుకోవడం పెద్దగా కష్టంకాలేదు. 'మగాళ్లూ ఇంత అందంగా రాస్తారా..' అని ఎందరో ఆడపిల్లల్ని ఆశ్చర్యచకితుల్ని చేసిన అక్షరాలవి. వాటి వెంట కళ్లు పరుగులందుకున్నాయి.

"అసలిక్కడ ఏం జరుగుతోంది. పాతబస్తీ కుస్తీపట్లకు పగిలిన దేవిడీ అద్దం ఏం ప్రతిబింబిస్తోంది? కాంక్రీట్ అరణ్యాల మధ్య మూసీ ఎందుకు మూసుకుపోతోంది. హైటెక్ సిటీ అధికారదర్పం ముందు ఫలక్‌నుమా ప్యాలెస్, నౌబత్‌పహాడ్ నదీనగ్న పాదాలతో ఎందుకు నిలబడ్డాయి? భాగ్యనగరపు నడిబొడ్డున బషీర్‌బాగ్ ఎందుకు 'రక్తమోడింది? చార్మినార్ అకాశశిఖరాలపైన ఇనుప డేగ ఎందుకు ఎగురుతోంది? హైదరాబాద్... హైదరాబాద్... అందాల నా రాకుమారి. నీ ముక్కూ చెవులూ కోసేస్తున్నదెవరు? నిన్ను నెత్తుటి మడుగును చేస్తున్నదెవరు? కవితాగానం తర్వాత, చప్పట్లు చరుస్తూ పరిగెత్తుకొచ్చి తల్లోని పువ్వును కానుకగా ఇచ్చిన అమ్మాయేది? లాడ్‌బజార్ గలగలలు వినిపించిన చోట ఇప్పుడీ కత్తుల నెత్తుటి కోలాటాలేమిటి? భాగ్యనగరాన్ని అభాగ్యనగరంగా మార్చిందెవరు? అన్నీ ప్రశ్నలే. ప్రశ్నల కోసం జవాబులు వెతుక్కుంటున్నారందరూ.

నడిబొడ్డున 'శిల్పారామం' ఫోక్ విలేజ్‌ను పాతుకుని హైదరాబాద్‌ను గ్లోబల్ విలేజ్‌గా మార్చామని చంకలు గుద్దుకొంటున్న ఏ మేధావి సమాధానం చెబుతాడు?

ఎందుకో హైదరాబాద్ కుంచించుకు పోయినట్లు, డొక్కలోకి కాళ్లూ చేతులూ దోపుకుని ముడుచుకు పోయినట్లు, గుర్తుతెలియని వ్యాధి కమ్మేసి మనిషితనం లోలోపలికి ఇంకిపోయినట్లు కనిపిస్తోంది. ఇరుకుగా మారింది రోడ్లుకాదు.. మనసులు, మనుషులు. కిడ్నీల్లో అయినట్లు గుండెల్లో రాళ్లయితే....

మనసుల్ని విశాలం చేసే మాత్రలున్నాయా? మంత్రాలున్నాయా? యంత్రాలు న్నాయా?

ఔరంగాబాద్‌లో ప్రతిరోజు నేను యూనివర్సిటీకి వెళ్లేప్పుడు పానీ కా చక్కీ దగ్గరున్న పాతమసీదు గోడపై ఓ కవిత కనిపిస్తుంటుంది.

ఆషిఖ్ కహో, ఆసిర్ కహో
ఆగ్రేకాహూ....
ముల్లా కహో, దబీర్ కహో
ఆగ్రేకాహూ
ముఫ్లిస్ కహో, ఫకీర్ కహో ఆగ్రేకాహూ.....
షాయర్ కహో, నజీర్ కహో ఆగ్రే కాహూ..
ప్రేమికుడనండి, ప్రేమపాశబద్ధుడనండి.. ఆగ్రావాణ్ణి
పండితుడనండి, పరమవిద్వాంసుడనండి... ఆగ్రావాణ్ణి
బీదవాడనండి, ఫకీర్ అనండి.. ఆగ్రావాణ్ణి
కవి అనండి, నజీర్ అనండి.. ఆగ్రావాణ్ణి

ఇప్పటికి ఎన్ని వేలసార్లు చదువుకున్నానో.. చదివిన ప్రతీసారి ఓ మాటనుకుంటాను. గజల్‌రాజు నజీర్ అక్బరాబాదీ హైదరాబాద్‌లో పుట్టిఉంటే ఎంత బాగుణ్ణు.

ఏథెన్స్‌ను 'సిటీ ఆఫ్ ఏడోనస్' అంటారు. నాకు మాత్రం హైదరాబాద్‌ను 'సిటీ ఆఫ్ వీనస్' అనాలనిపిస్తుంది. టెక్సాస్‌ను కడదాకా ప్రేమించిన డేవిడ్ ఎవాన్స్ మాటలను నా మాటగా చెబితే–

యుకెన్ టేక్ ఎ బాయ్ అవుట్ ఆఫ్ హైదరాబాద్. బట్, యు కాన్ట్ టేక్ హైదరాబాద్ అవుట్‌ఆఫ్ ది బాయ్. నెవర్...... నెవర్...... అండ్ నెవర్.. హైదరాబాద్ జిందాబాద్"

సాగర్‌లో చెలరేగిన ఆలోచనల సునామీ ఎన్ని సుడులు తిరగకపోతే ఆ కాగితాన్ని డైరీలోంచి చింపి పడేయాల్సి వస్తుంది. చకచకా జేబులోంచి సెల్ తీసుకుని సాగర్‌కు ఫోన్ చేశాను...

* * *

'తుక్డే తుక్డే కర్కేహీ వో లోగ్ చోడేగా'.. చాంద్‌సాబ్ అరుపులు వినిపిస్తున్నాయి.. హృదయాన్ని ఎవరో మెలిపెట్టి వదులుతున్న బాధ.

ఫ్లైఓవర్ ఆక్టోపస్ అష్టపాదాల మెలికల యాత్ర.. పున్నాయిగ చెట్లు తలకిందులుగా కనిపిస్తున్నాయ్.. గొంతులో చిక్కుకున్న చేపముల్లు గుండెలోకి జారుతున్న అసౌకర్యం.

'హైదరాబాద్.. హైదరాబాద్.. అందమైన నా రాకుమారి..' సాగర్ చదువుతున్నాడు... పెనంపై నీటిచుక్క ఆవిరవుతున్న చప్పుడు.

* * *

'మీరు డయల్ చేసిన సబ్‌స్క్రైబర్ కవరేజ్ ఏరియాలో లేరు..' ఆడగొంతు సున్నితంగా అరుస్తున్నా వినిపించుకోవడం లేదు, తిమ్మిరెక్కిన చెవి.



గప్పుడు సక్రమం... గిప్పుడు అక్రమం!

రుక్మిణి

"నువు చెప్పింది నాకస్సలు అర్థం కావటం లేదు బావా"! సోమయ్య చాలా దిగులుగా అన్నడు. చంద్రంబావ చాలా వుషారుగానే వికవిక నవ్విండు.

"సక్రమం అక్రమమేందీ... అసలీ సక్రమమేందీ... మరింగ అక్రమం సక్రమమేందో... నా బుర్ర టపేల్మంటంది బావా..."

"ఒరే బుర్ర తక్వ బామ్మర్దీ... పాపం గీ జనాలు తమ రోజ్వారీ... దినందినం తిండి కుస్తీల్లో పడి బుర్ర పదును గింతగింత తగ్గిచ్చుకుంటండ్రా... ఎవరు ఏం మాట్లాడ్తన్నరో ఎవడు పట్టిచ్చుకోవటంలేదు. పట్టిచ్చుకుందామంటే గవసలు అర్థం... సమజ్ కాటంలేదు..."

"అబ్బ బావా... మడుగుల మునిగినోడ్ని వూబిలోకి తొక్కినట్టు మళ్ళీ సమజ్‌కాని మాటలు... అసలు బావా నువు మాట్లాడ్తంది ఏ భాష.. ఏ యాస... పారిన్ భాషనైనా సమజ్ చేస్కోవచ్చుగాని, నువు చెప్పేది దిమాఖ్‌లకు ఎక్కిచ్చుకోటం నా చేతకాదు బావా... నువు మహాగ్యానివి... వామ్మో అసలింతకు నువు కాన్గిరి బడిలో ఆరుదనకా సదుకుంటివి... మరి గింత దమాఖ్ యాడ్నొంచి దెచ్చుకున్నవే బావా..." సోమయ్య భయం భయంగ అడిగిండు.

"బామ్మర్దీ" మనదేశంలో రాజకీయాల్లోకి వచ్చినంక మనిషి పూర్తిగా మారతడు. మా రాజకీయాపోల్లందరిదీ ఒకేయవా... బాన... ప్రెజలు ఎర్రిమొహాలేస్కని సూస్తుండాలె... ఎందుకంటే వాండ్ల బాష వేరు. వాండ్లకు మా భాష అర్థంకాదు. "మాలో మేం మాట్లాడుకుంటుంటే మాకు సమజయితది. వాండ్లకు కాదు. గందుకే మేం పెద్ద తెలివయినోళ్ళమని గుడ్లప్పగించి చూస్తరు"

సోమయ్యకంతా చికాగ్గుంది. బుర్రకాయంతా తిరిగిపోతంది. ఈ రాజకీయాల భాషేంది. వుర్దూ వుంటది. ఇంగిలీసుంటది... హిందీ వుంటది. తమిళముంటది. బావగానీ పొద్దున పొద్దున్నే మంచి తాటికల్లుగాని ముంతెడు పట్టిచ్చిండా... అక్కతోని చెప్పాలె... గపుడుగాని గీ 'రాజకీయం బాష' బయటపడతది.

"అక్కోయ్... అక్కోయ్..." సోమయ్య ఇంట్లోకి చెడబడ రెండుకేకలు పెట్టిండు.

"అరెబాంచెన్ గిపుడు గదెందుకురా... ఏదో బామ్మర్దివిగదా... రాజకీయం భాష చెప్పుదమనుకుంటే దాన్ని పిలుస్తవే తోలుదీస్త" అని అరిచేసరికే సోమయ్య కుమిలిపోయి మళ్ళీ కూలబడ్డడు.

"అరె... ఒక కథ చెప్త... జరవిను... అనగనగనగ ఒక గవర్మెంటాఫీసు... ఓ పాతికమంది గుమస్తలు... దాన్లోకి అవాళ్నే కొత్తంగ ఒక పదుచుక్లర్కు వచ్చి చేరిండు... సరే మధ్యాహ్నం భోజనం సమయంలో అందరు ఒక హాలులోచేరి ముచ్చట్లు పెట్టుకుంట లంచుతింటరు. గట్ల తింటున్నపుడు గందులో ఒకడు 'పదారు' అన్నడు. అందరూ పడీపడీ నవ్విండ్రు - కొద్దిసేపాగి మరోడు 'నూట ఇరవై' అన్నడు. అందరూ చెడబడ నవ్విండు గట్ల ఒక గంటసేపు నంబర్లు చెప్పుకున్నరు. నవ్వుడు. కొసాకర్న ఒకడు 610 అన్నడు. అందరూ మళ్ళీ నవ్విండ్రు. అయిదారుగురు క్లర్కులు నవ్వలేదు. గదంతచూసి కొత్తంగ వచ్చిన గుమస్తా బుర్ర గిరగిర తిరిగిపోయింది.

"అయ్యా గీ నంబర్లేంది... నవ్వుడేంది?

చివర్న అయిదారుగురు ఒక నంబరుకు నవ్వలేదేంది? గురువా... ఏందికతా..." అని అడిగిండు.

గపుడు గురుడు "గదే మేం అందరం కలిసి ఒక జోకుల పుస్తకం తయారు చేస్తున్నం... ఒక్కో జోకు చెప్పుకోటానికి పదినిముషాలు పడతది. మరి గంటలోనే చాలా జోకులు చెప్పుకుని నవ్వాలెగద... గందుకీన గట్ల నంబర్లు చెప్పుకుంటుంటే గవి గుర్తు తెచ్చుకుని గట్ల నవ్వుకుంటం" అని చెప్పిండు.

"మరి చివర్నగా నలుగురయిదుగురు ఒకనెంబరు చెప్పినపుడు నవ్వతలెందుకు?" అని అడిగిండు.

"గదా... వాండ్లు ఇంకా గా నెంబరు పేజీ దనక సదవలేదు. గందుకు" అనంగనేగా గుమస్తా మూర్ఛపోయినంత పన్జేసిండు.

చంద్రంబావ గీ కథపూర్తి చేసేతలికి సోమయ్యకూడా దఢాలున మూర్ఛపోయి, లేచి బావకు ఒంగి దండం పెట్టిండు. "నిజంబావా ఎవడి బాస వాడికున్నట్లు బాగచెప్పినవే బావా... అబ్బో... అబ్బో" అని తెగమెచ్చుకున్నడు.

"మరి గీ నక్రమం... అక్రమం... మరి అక్రమం... సక్రమం ఏంది బావా...!" అని బహు అమాయకంగా అడిగిండు సోమయ్య.

"చూడు బామ్మర్దీ... తెలుగుదేశం అధికారంల వుండంగ ఇంటింటికీ బెల్టుదుకాణాలు పెట్టి రికార్డు పెట్టింది. గివాలదే పార్టీ బ్రాంది బారు దుకాణాలు మూసెయ్యాలని గోలకు తగులుకుంది. మరి గపుడు గీ కాంగ్రెస్సే బ్రాంది దుకాణాలు వద్దని అల్లరి పెట్టింది. మరిగిపుడే ఓ వెయ్యి దుకాణాలకు లైసెన్సులిస్తనంటంది.

పేటెంటు చట్టానికి సంతకం పెట్టింది ఎన్డీయే సర్కారు. గపుడు కాంగ్రెసు దాం... దూం... అని గోల పెట్టింది. మరిగిపుడు గదే కాంగ్రెసు గా పేటెంటు చట్టాన్ని అమలు చేస్తంటే ఎన్డీయే గుంపు వద్దో అని అల్లరి పెడుతోంది.

మరి వామపక్షాలు దానికి అవసరపడిన బోలెడన్ని సవరణలు తెస్తేనే మద్దతిచ్చినయి. నేన్చెప్పిన కథలో ఫలానా పేజీ ఇంకా చదవినోళ్ళ లాంటి బుద్ధిమంతులు.

సోమయ్య, చంద్రం బావలో గౌతమ బుద్ధుడ్ని చూస్తున్నవాడిలా... సగం మూసి, సగం తెరిసిన కండ్లతో అతిభక్తిగా చూస్తుండిపోయాడు. ★

డా॥ కె.ఎల్.వి. ప్రసాద్

తెల్లమచ్చలు ప్రమాదం కాదు!!

మనిషి ఆడ, మగ అనే తేడా లేకుండా సౌందర్యానికి ప్రాధాన్యతనీయడం నిత్యజీవితంలో మనం చూస్తూనే ఉన్నాం. అందంగా కన్పించాలన్నదే అందరి కోరిక. శరీర సౌందర్యంలో ముఖ్యమైన అంశం చర్మ సౌందర్యం. చర్మ సౌందర్యం కోసం, చర్మ సంరక్షణ కోసం ఎంత ఖర్చు పెట్టడానికైనా సిద్ధంగానే వుంటారు.

కొంతమంది స్త్రీలు తమ రహస్య ప్రదేశాల్లో ఎలాంటి చర్మ సమస్య వచ్చినా అశ్రద్ధ చేస్తారు. దీనికి కారణం రహస్య ప్రదేశాల్లో చర్మ సమస్య వుండడం మూలాన, ఎక్కువమంది చర్మ వైద్యనిపుణులు పురుషులే వుండడం మూలాన సిగ్గుతో చికిత్సకు సిద్ధపడరు. అయితే బయటికి కన్పించే చర్మంపైన ఎలాంటి చిన్న సమస్య వచ్చినా వెంటనే వైద్యులకు చూపించుకునేవారూ వున్నారు. తర్వాత అదేమవుతుందిలే అని అశ్రద్ధ చేసే వాళ్ళు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆడ, మగ, ధనిక, పేద అనే తేడా లేకుండా అందరినీ భయభ్రాంతులకు గురిచేసే చర్మ సమస్య ముఖం మీద, కాళ్ళ మీద, చేతుల మీద, యితర శరీర భాగాల మీద మచ్చలు రావడం.

చర్మం మీద మచ్చలు రావడానికి అనేక కారణాలున్నాయి. అన్ని రకాల మచ్చలు స్థిరంగా వుండిపోయేవి, అలాగే ప్రమాదమయినవి కావు. విటమిన్ల లోపం వల్ల వచ్చే మచ్చలు, అధిక సూర్యరశ్మి వల్ల వచ్చే మచ్చలు, ఎలర్జీ వల్ల వచ్చే మచ్చలు సకాలంలో తగిన చికిత్స చేయించుకుంటే త్వరగానే తగ్గిపోతాయి. కొన్ని రకాల మచ్చలు వైద్యం ద్వారాను, శస్త్రచికిత్స ద్వారాను కొంత వరకు నయం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆ వర్గానికి చెందిన మచ్చలలో 'బొల్లి' మచ్చలు ముఖ్యమైనవి. ఈ బొల్లి మచ్చలనే "ల్యూకోడెర్మా" తెల్లమచ్చలు లేదా 'విటిలోనో' అంటారు. ఇది వ్యాధి మాత్రం కానేకాదు. కొంత వయస్సు వచ్చాక తలమీది వెంట్రుకలు ఎట్లా తెల్లబడిపోతాయో యించుమించు ఇది కూడా అలాంటిదే! తల నెరిసిపోతుంటే మనం ఏ విధంగానూ ఆందోళన చెందం. అది కూడా వయస్సుతోపాటు వచ్చే మార్పుగా సర్దుకుపోతాం. కాని బొల్లి కూడా వ్యాధి కాకపోయినప్పటికీ యిది వస్తే మనం భయపడతాం. ఆందోళన చెందుతాం. ఈ రకంగా యిది ఒక సామాజిక సమస్యగా తయారయింది. అయితే ఒంటి మీద 'తెల్లమచ్చ' చూడగానే భయభ్రాంతులకు గురికావడానికి మరో ప్రధానకారణం, 'బొల్లి'ని 'కుష్ఠువ్యాధి'గా భ్రమపడడం. కుష్ఠువ్యాధికి సంబంధించిన మచ్చలు కూడా తెల్లగానే ఉంటాయి మరి! స్పర్శ కోల్పోవడం కుష్ఠువ్యాధి మచ్చల ప్రత్యేకత అని తెలుసుకుంటే, ఏ భయమూ మనను చికాకుపర్చదు.





కారణాలు

'బొల్లి' రావడానికి ఆధారపరమయిన కారణాలంటూ ఏమీలేవు. ఇది అసలు వ్యాధే కాదు! అయితే 'లెప్రసి' (కుష్ఠు) మాత్రం వ్యాధి. దీనిలో 'నరాల' పాత్ర ప్రధానంగా వుండడంవల్ల, కుష్ఠువ్యాధి మచ్చలున్న చర్మప్రాంతం మొద్దుబారిపోయి వుంటుంది. అంటే సూదితో గుచ్చినా స్పర్శలేక నొప్పి అన్పించదు.

బొల్లి అంటువ్యాధి కాదు. దీనివల్ల ప్రాణహాని వుండదు. దీనితోపాటు యితర సమస్యలు ఉత్పన్నం కావు. అలాగయితే వంశపారంపర్యమైన సమస్య కూడా కాదు. చాలా మంది దీనిని ఆహారపు అలవాట్లతో ముడి పెడతారు. ఫలానా పదార్థాలు తినడం వల్ల వస్తుందని ప్రచారం చేస్తారు. కాని ఇందులో నిజం లేదంటున్నారు పరిశోధకులు. ఇది 'పిగ్మెంటేషన్'కు చెందిన సమస్య. అంటే శరీరానికి రంగును కలుగజేసే కణాల సమస్య అన్నమాట! అదే విధంగా చాలా మంది అనుకుంటున్నట్లు ఇది ఫలానా సబ్బులు వాడడం వల్లగాని, షాంపూలు వాడడం వల్లగాని, సువాసన-సుగంధ స్ప్రేలు వాడకం వల్లగాని బొల్లి మచ్చలు రావు.

చాలామందిలో 'బొల్లి'కి సంబంధించిన కారణాలు కనుగొనడం కష్టం. అయితే శరీరంలో రక్షక కణాలకు రంగును కలిగించే 'మెలనోసైట్ల'కు గల ఘర్షణకు కారణమే 'తెల్లమచ్చలు' అని చెబుతారు. ముందు చెప్పినట్లుగా, మెలనోసైట్లు – మెలనిన్ అనే పిగ్మెంట్లను ఉత్పత్తి చేసే కణాలు. అయితే మనిషి శరీర రంగును బహిర్గత పరుస్తుంటాయి.

అసలు విషయానికొస్తే బొల్లి ఉన్న శరీర భాగంలో ఈ 'మెలనోసైట్లు' వుండవు. ఈ బొల్లి మచ్చల్లో కూడా మూడు రకాలు ఉన్నాయి. 1. మ్యూకోజల్ 2. సెగ్మెంటల్ 3. ఆక్రో ఫేషియల్ (మిశ్రమ). వీటన్నింటిలోను ఇరవైశాతం మాత్రమే చికిత్సకు లొంగుతాయి. అంటే చికిత్స ద్వారా మచ్చలను

పోగొట్టవచ్చు. ఇంకొక విశేషం ఏమిటంటే వెంట్రుకలు వుండని నోటిభాగం కంటే, వెంట్రుకలు వుండే యితర శరీరభాగాలలో వచ్చే ఈ తెల్లమచ్చలు చికిత్సకు అనుకూలంగా వుండి ఫలితాలు సంతృప్తికరంగా వుంటాయి.

చికిత్స

తెల్ల మచ్చలు అనబడే ఈ బొల్లి మచ్చలకు చికిత్స రెండు విధాలుగా వుంటుంది. మొదటిది ఔషధపరమైనది, రెండవది శస్త్రచికిత్సకు సంబంధించినది. బొల్లి రకాన్ని బట్టి, మచ్చల సంఖ్యను బట్టి, బొల్లి మచ్చలు వచ్చిన ప్రదేశాన్ని బట్టి ఏ మందులు వాడాలన్నది నిర్ణయించబడుతుంది.

మచ్చలపెరుగుదల, తీవ్రంగా శరీరాన్ని ఆక్రమిస్తున్న పరిస్థితిని బట్టి 'స్టిరాయిడ్' మందులను వాడతారు. వీటిని ఎట్టి పరిస్థితుల్లోను స్వంతంగా వాడకూడదు. చర్మ వ్యాధి నిపుణుల పర్యవేక్షణలో మాత్రమే ఈ మందును వాడవలసి వుంటుంది. దీనివల్ల అంటే స్టిరాయిడ్ల వాడకం వల్ల ముందుగా మచ్చ మరింత పెరగకుండా ఆగిపోతుంది. వైద్యుల పర్యవేక్షణలో క్రమపద్ధతిలో, క్రమశిక్షణతో ఈ మందును వాడడంవల్ల, ఇతర సమస్యలు రావు. ఫొటో థెరపీతోపాటు 'సొరాలెన్' అనే మందును వాడడం వల్ల సాధారణంగా అరవయి నుంచి డెబ్బై శాతం బొల్లి మచ్చలు అదృశ్యమవుతాయి.

ఔషధపరమైన చికిత్స ద్వారా తగిన ఫలితాలు లభించని పక్షంలో, శస్త్ర చికిత్స మాత్రమే చివరి దిక్కు అవుతుంది. కొంత మందిలో ఔషధ చికిత్స, శస్త్రచికిత్స కలిపి మంచి ఫలితాలనిచ్చిన సంఘటన లున్నాయి. అంటే ఈ విధానం ద్వారా తొంభై శాతం మందిలో తెల్లమచ్చలు తగ్గిపోతాయి. 'మైక్రోపంచ్ గ్రాఫ్టింగ్' అనే శస్త్ర చికిత్స ద్వారా బొల్లి మచ్చ ఉన్న ప్రదేశంలో సాధారణ చర్మాన్ని గ్రాఫ్ట్ చేస్తారు. తరువాత నాలుగయిదు నెలలకు చర్మాన్ని అంటు చేసిన ప్రదేశంలో పిగ్మెంటేషన్ కన్పిస్తుంది. దీనిని 'రీ-పిగ్మెంటేషన్' అంటారు.

'స్ప్లిట్ స్కిన్ గ్రాఫ్టింగ్' అన్నది రెండవ శస్త్ర చికిత్స పద్ధతి. ఇది త్వరితగతమైన సౌందర్య శస్త్ర చికిత్స విధానం. పంచ్ గ్రాఫ్టింగ్ పద్ధతి కంటే ఇది తక్కువ శాతం ఫలితాలనిస్తుంది. ఈ గ్రాఫ్ట్‌ను శరీరం అనుమతించగలిగితే 'స్ప్లిట్ స్కిన్ గ్రాఫ్టింగ్' మేలైన పద్ధతి. ఇంకా 'మైక్రోపిగ్మెంటేషన్' (పర్మనెంట్ మేకప్) అని కూడా చేస్తారు. ఇరవై సంవత్సరాలపాటు ఈ మేకప్ నిలుస్తుందని పరిశోధకులు సెలవిస్తున్నారు. 'మెలనోసైట్ కల్చర్' అన్నది ఇప్పుడు ప్రయోగస్థాయిలో వుంది. ఇలా అనేక రకాలుగా ఇప్పుడు తెల్ల మచ్చలను తొలగించుకోగల చికిత్స విధానాలు అందుబాటులోకి వచ్చాయి. త్వరలో సామాన్యుడికి అందుబాటులోకి వచ్చే మరిన్ని ఆధునిక సౌకర్యాలు లభ్యమవుతాయని ఆశించడం అతిశయోక్తి కాదేమో!

- (ది హిందూ సౌజన్యంతో)

దంత సంరక్షణ క్విజ్-4

నిర్వహణ: డా॥ కె.ఎల్.వి. ప్రసాద్, హన్మకొండ

1. క్రింది దవడను ఈ విధంగా పిలుస్తారు.
   అ) మాక్సిలా ఆ) పాలటో
   ఇ) మాండిబుల్ ఈ) అన్నీ తప్పే.
2. పుఱ్ఱె ఎముకకు అతికించబడి కదలకుండా వుండే దవడ
   అ) మాండిబుల్ ఆ) మాక్సిలా
   ఇ) మాండిబుల్+మాక్సిలా ఈ) పై మూడూ కరెక్ట్ కాదు
3. 'కీలు' సాయంతో కదిలే దవడను ఈ విధంగా పిలుస్తారు.
   అ) మాక్సిలా ఆ) మాండిబుల్
   ఇ) మాక్సిలా+మాండిబుల్ ఈ) పై మూడూ కరెక్ట్ కాదు
4. కదిలే దవడకు వీలుకలిగించే కీలును ఈ విధంగా పిలుస్తారు
   అ) టి.ఎం.జె. కీలు ఆ) జె.ఎం.జె. కీలు
   ఇ) కె.ఎం.జె. కీలు ఈ) ఎం.ఎం.జె కీలు
5. కొన్ని కారణాల వల్ల దవడ కదలకుండా నోరు మూసుకుపోవడాన్ని
   అ) క్లోజ్డ్ మౌత్ అంటారు ఆ) టైట్ మౌత్ అంటారు.
   ఇ) ట్రిస్‌మస్ అంటారు ఈ) అన్నీ కరెక్ట్
6. ఎక్కువ శాతం ఇబ్బంది పెట్టే 'జ్ఞాన దంతం' గల దవడ
   అ) పై దవడ ఆ) కింది దవడ
   ఇ) రెండు దవడలు ఈ) పై మూడూ కరెక్ట్ కాదు
7. దవడలో జ్ఞాన దంతం కన్పించే వయస్సు
   అ) 17-21 సంవత్సరాలు ఆ) 10-17 సంవత్సరాలు
   ఇ) 12-19 సంవత్సరాలు ఈ) 19-25 సంవత్సరాలు
8. చికిత్సాపరంగా 'జ్ఞాన దంతాన్ని' తీయించవలసివస్తే
   అ) కంటిచూపు తగ్గిపోతుంది ఆ) జ్ఞానం పోతుంది
   ఇ) ఆహారం నమలడం కష్టం ఈ) అన్నీ మూఢనమ్మకాలే
9. దవడలో పన్ను వచ్చిన తరువాత కొంత భాగం పైకి కన్పిస్తుంది. కొంత భాగం కన్పించకుండా పంటి కుదురులు అంతర్గతంగా వుంటుంది. ఇలా కన్పించని భాగాన్ని
   అ) కిరీట భాగం అంటారు ఆ) మూలభాగం అంటారు
   ఇ) దవడ భాగం అంటారు ఈ) అన్నీ కరెక్ట్
10. దవడలో పైకి తెల్లగా కన్పించే ముఖ్యమైన పంటి భాగాన్ని ఇలా పిలుస్తారు.
   అ) మూలభాగం ఆ) కిరీటిభాగం
   ఇ) ఎనామిల్ భాగం ఈ) డెంటల్ భాగం

జవాబులు:
1) ఇ 2) ఆ 3) ఆ 4) ఆ 5) ఆ
6) ఆ 7) ఆ 8) ఈ 9) ఆ 10) ఆ

ఈ జ్ఞాపకాలు ఎందరికో పాఠాలు

మండువేసవిలో చల్లటినీళ్లు తాగాక అబ్బ "ఈ నీళ్ళు ఎక్కడివో" అనడిగే ప్రశ్నలో నీరు పోసినవారిపై, ఆ నీళ్ళు అక్కడ సమకూరడానికి కారకులపై ఎనలేని కృతజ్ఞత పుష్కలంగా ఉంటుంది. అలాంటి ప్రశ్న ఎందరి విద్యాదాహాన్నో తీర్చిన చుక్కా రామయ్యగారికి స్పృహ సాహితీ సంస్థ వేసింది. "మిమ్మల్ని తీర్చిదిద్దినది ఎవరు?" అన్న ప్రశ్నకు బయటకు ఉబికివచ్చిన జ్ఞాపకాల చెలమ ఈ "రామయ్య జ్ఞాపకాలు" పుస్తకం. వీరి జ్ఞాపకాల నిండా, అనుభవాల నిండా నిండిపోయిన నిండైన వ్యక్తి భువనగిరి వెంకట్రావుగారు అని ప్రతీ చాప్టర్‌లోనూ తెలుస్తుంది. విద్యార్థుల విద్యాదాహాన్ని తీర్చిన ఈ నల్లా గురించి తెలుసుకోబోతే ఆ జ్ఞాననల్లాలోంచి వచ్చే నీరు ఎక్కడిదో, ఆ నీరు ఎంతటి తియ్యనో కూడా తెలిసిపోతుంది. ఒక ఉపాధ్యాయుడికి మరో ఉపాధ్యాయుడు ఉపాధ్యాయుడవ్వడం అంటే దానికి చుక్కా రామయ్య మాస్టారి అనుభవాల్లో ఇంకిపోయి, ఒదిగిపోయిన తెలిదేవర వెంకట్రావుగారే నిలువెత్తు సాక్ష్యం.

ఒక ఉపాధ్యాయుడి జ్ఞాపకాలూ ఎందరో ఉపాధ్యాయులకు పాఠాలవ్వడం అంటే ఎవిటో ఈ పుస్తకం చదివినవారికి ఇట్టే అర్థమవుతుంది. 'ప్రిపరేషనే పునాది' అనే శీర్షిక కింద 'టీచర్లు స్కూలుకి హాజరవ్వడమే కాదు...వాళ్ళేం చెప్పాలి...క్లాసులో ఉన్న ముప్పావుగంట మొదటి నిముషం నుండి చివరి నిముషం వరకూ ఎలా చెప్పాలి అనే ప్రిపరేషన్ ఉండాలి' అనే విషయాన్ని ప్రముఖంగా రాశారు. ఆ పద్ధతి ఈ పుస్తకంలో కూడా అద్భుతంగా పాటించారు. పాఠాలు చెప్పే ఉపాధ్యాయులకు పాఠాల్లాంటి పుస్తకాలు చాలా అరుదు. అలాంటి పుస్తకాలురాసిన సుఖోమ్లినిస్కీ కావచ్చు, లున్‌చార్‌స్కీ కావచ్చు, మన గిజుబాయి బగేకా కావచ్చు. వారందరి ఆచరణాత్మక అనుభవాల్లోంచే ప్రతీ అక్షరం వచ్చిందా అన్నంత గాఢంగా ఉంటాయి. అంతటి గాఢత ఈ పుస్తకంలోనూ తొంగిచూస్తుంది. అలాగని అంతటి సిద్ధాంతకర్తల క్లిష్టమైన స్థాయికెళ్ళేసి, బోధనా స్వరంతో కాకుండా రామయ్యగారు ఎంతో అవసరమైన సంగతులను అలవోకగా 'చెప్పేభాష'లో రాశారు. స్పృహ సాహితీ వారు అదే స్పృహతో అచ్చొత్తించారు.

స్కూలు అసెంబ్లీ ఆ పాఠశాలకు గుండెకాయ అంటారు రామయ్య మాస్టారు జ్ఞాపకాల్లోని వెంకట్రావు పెదమాస్టారు. పాఠశాలలో ఉన్న అందర్నీ మరెక్కడా చూడలేని సందర్భమయిన అసెంబ్లీకెళ్ళకుండా క్లాసుకెళ్ళిపోతే తరగతి గదుల కూపస్థమండూకాలై పోతారని ఈనాటి టీచర్లందరూ గమనించాలి. విద్యార్థి అంటే లక్షలాది రూపాయిల చెక్కులా కనబడే కార్పోరేట్ స్కూళ్ళలో టైమ్ కూడా కరెన్సీయే కదా. అలాంటిచోట అసెంబ్లీ అనంటూ ఒకింత టైమ్ కేటాయించుతారని ఊహించగలమా అనిపిస్తోంది.

'మనకు నోట్సులూ హోంవర్కులే కనిపిస్తాయి. వాటి వెనుక ఉన్న మనిషి కనబడదు' అనే మాట వెనుక ఎంత మానవీయ హృదయముందో అనిపిస్తుంది మనకు. భువనగిరి మాస్టారి ఈ మాట వెనుక రామయ్య మాస్టారి అనుభవం 'ప్రతీ విద్యార్థీ ఒక పాఠ్య పుస్తకమే' అని టీచర్ల స్టాఫ్‌రూమ్‌లో వేలాడేసే అట్టమీది నినాదమయ్యింది.

రామయ్య జ్ఞాపకాలు
చుక్కా రామయ్య
వెల: రూ. 45/-
ప్రచురణ: స్పృహ సాహితీ సంస్థ, కోదాడ
పేజీలు: 89
ప్రతులకు: అన్ని పెద్ద పుస్తకాల షాపులు.

మేం పాఠాలు చెప్పేవాళ్ళం మాకు పాఠాలేంటి అనుకోకుండా ఇలాంటి పుస్తకాలు చదవాల్సింది తప్పనిసరిగా మాస్టార్లే. ఎందుకంటే రామయ్యగారన్నట్లు...తెలిదేవర వెంకట్రావుగారన్నట్లు "టీచరు గీసే ప్రతీ గీత విద్యార్థి నుదుటి రాత" కాబట్టి. ఈ పుస్తకం సంపాదకుడు, కవి జూలూరు గౌరీశంకర్ అన్నట్లు 'రామయ్య వ్యాసాలు కిటుకులు కాదు...ఉపాధ్యాయులు ఆచరించాల్సిన సత్యాలు, కాబట్టి.

-శంకర్

వామపక్ష కవితా గమనం

"స్నేహాలు, ప్రేమలు సకల మానవ సంబంధాలు/నిచ్చెన మెట్లయిన తెలివితేటల వ్యవస్థలో/ ఎవరి ఆత్మహత్యలకు వాళ్ళే బాధ్యులు/ఎవరి యుద్ధాలు వారివే అయిన వ్యక్తివాద పోరాటంలో/స్మశాన సౌందర్యానిదే గెలుపు"

ఈ కవితాపాదాలు చదివితే మంచి కవిత్వం రాయగల శక్తి రత్నమాల గారికి వున్నదని కవితా పాదాలు నిరూపిస్తాయి. 1968 నుండి 2004 వరకూ మధ్యకాలంలో రత్నమాల రచించిన కవితా, గేయ,ఉత్తరాలు, రిపోర్టుల నోట్‌బుక్ మొదలగు రచనల సంపుటి "గమనం ఘర్షణ గమ్యం".

ఎదుటివ్యక్తి నుంచి మనం ఆశించింది మనకు లభించకపోతే ఎంతసేపూ మనదృష్టితోనే ఆలోచిస్తే కారణం తెలియదు. ఎదుటివాడి కోణంలోంచికూడా ఆలోచిస్తేనే సమాధానం దొరుకుతుంది. ఎదుటివాళ్ల మనం ఆశించినట్లు ఎందుకు ప్రవర్తించలేకపోయారన్న విషయం. దీనికి ఉదాహరణగా 'ఆత్మ ప్రబోధం' నిలుస్తుంది. కీ.శే. కుందుర్తిగారి మాటలకు సమాధానంగా 1974లో అప్పటికప్పుడు వ్రాసిన కవితగా 'ఆత్మప్రబోధం' గురించి ప్రస్తావించారు కవయిత్రి. అప్పటికప్పుడే వ్రాసి, ఆ కవి సమ్మేళనంలో చదివిన ఈ కవితలో ఎన్నో సత్యాలు, వ్యక్తమవుతాయి.

"నీలో నివసించేది/నేనే అనుకున్నా/స్వార్థం స్థానం సంపాదించిందని / సహించలేకపోతున్నాను. అనుబంధాలకీ అనురాగాలకీ లొంగి/ఆదర్శాలను అమ్ముకుంటావనుకోలేదు. నేనే నీవనుకున్నాను/ నీవే నేననుకున్నాను/నిజాన్ని నిప్పుల పాల్జేస్తావనుకోలేదు/ న్యాయంనోట్లో నీళ్లు వదులుతావనుకోలేదు./నువ్వు నడిచేదారిని/ ఆలోచించి నిర్ణయించు కుంటావనుకున్నాను/నిర్ణయించుకుని ఆలోచించి/ ఆచరణకు అందకుండా పోతావనుకోలేదు/నేను మోసపోలేదు/నువ్వు నష్టపడతావు" అంటూ శపిస్తుంది.



గమనం-ఘర్షణ-గమ్యం
యం. రత్నమాల
వెల: రూ. 40/-
పేజీలు: 35
ప్రతులకు: అన్ని బుక్‌స్టాల్స్‌లో లభించును.

విరసం ప్రణాళిక తన నిబద్ధత అనీ, ఆ నిబద్ధతే తన కార్యాచరణ అనీ, ఆ కార్యాచరణే తన కవిత్వమని ప్రకటించిన యం.రత్నమాల దారి తప్పిన కామ్రేడ్స్‌ను 'వేదన-వాదన' కవితలో నక్సలిజం పోరాటంలో సంయమనం ఉండాలనీ, అహాన్ని వీడాలని చెప్తుంది.

"మన్నించండి కామ్రేడ్స్! మనని మనమే చంపుకుంటున్న అహాన్ని అమరత్వంగా కీర్తించలేము" అంటూ 'అడవితల్లి ఒడిని చీల్చి/పల్లెతల్లి గుండెకోసి/ మిమ్మల్ని మీరు ధ్వంసించుకోవటానికా?" ఉద్యమం అని ఆలోచించమంటుంది.

తాను నమ్మిన సిద్ధాంతాన్ని చెప్పటానికి యం.రత్నమాల తన కవిత్వాన్ని నినాదాల కవిత్వంగా మార్చలేదు. రాసినవి పెద్దరాశి కాకపోయినా వాసి గలవి వాడిపోనివి.

"ఇప్పుడు నేను.../ కదనంలో నిలిచిన కామ్రేడ్‌ని ఆదిమ గణాలకు నాయకత్వం వహించి క్రూరజంతువుల్ని చీల్చి చెండాడిన ఆదిమానవిని" అని ఆత్మ ప్రకటనద్వారా ఒక విస్ఫోటనం వినిపిస్తుంది.

స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలపై, అత్యాచారాలపై, నేటి మేడిపండు స్వాతంత్ర్యంపై సరైనమార్గదర్శకత్వం లేక బాధపడుతున్న యువత గురించి తన కవితల్లో, వ్యాసాల్లో, ఉత్తరాల్లో, గల్పికల్లో ప్రస్తావించి వాటికి తాను నమ్మిన విధంగా పరిష్కారాలు చెప్తుంది. అసెంబ్లీలో జరిగే తమాషాల గురించి, ముఖ్యమంత్రి తన ఏకపక్ష నిర్ణయాల గురించి తన రిపోర్టర్సు నోట్‌బుక్‌లో చెప్తుంది. ఇందులోనే వున్న 'భార్య?' కథ సమాజ దురాచారాలపై ధ్వజమెత్తుతుంది. 'ముగింపు' కథలో జీవితంపట్ల విసిగిన పాత్ర చనిపోవాలనుకుని సందర్భం కుదరక 'మృత్యువు కూడా మోసగించిందంటూ చివరకు ఆత్మహత్యచేసుకోకుండా బ్రతుకుమీది తీపితో ఇంటికి చేరుతుంది. ఆత్మహత్యసమస్యకు పరిష్కారంకాదు కదనే స్ఫూర్తిని.

యం. రత్నమాల భవిష్యత్తులో మరిన్ని మంచి కవితలు రాస్తారని, వాటిని ప్రకటిస్తారని ఆశిద్దాం.

- డా|| నాగినేని భాస్కరరావు

ప్రకృతి మాత కరుణా కటాక్షాలు అమితంగా ఉన్న ఏ ప్రదేశమైనా చిరస్మరణీయంగా మిగిలి పోతుంది. అటువంటి అద్భుత అందాల కోన ఖండాలా. ఈ ప్రాంతం మనవాళికి ప్రకృతి ప్రసాదించిన ఓ అద్భుత వరం.

కమనీయ దృశ్య కావ్యం
ఖండాలా

సరోజిని

ఇక్కడి పచ్చని చెట్లు, కొండలపై నుంచి దూకే జలపాతాలు, చల్లని గాలులు మనస్సును మరో లోకాల్లో విహరింపచేస్తాయి. కనుచూపు మేర కన్పించే హరిత వనాలు, చెట్లపై సేద తీరుతూ తమ మధుర గళాలతో మైమరపింపచేసే పక్షుల కమనీయ రాగాలు అలసిన మనసులకు ఎంతో ప్రశాంతతను చేకూరుస్తాయి. ఉషాకిరణాల వెలుగులో, తెల్లని మంచుతెర చాటున ఈ అందాలు మరింత అపురూపమనిపిస్తాయి. దీనిని లోనావ్లా నుంచి విడదీసి చూడలేము. రెండూ కూడా పర్యాటకులకు ఎంతో మనోల్లాసాన్ని అందిస్తాయి. ఈ రెంటినీ ఓ కొండ విడదీస్తున్నా ఉంటుంది. ముంబాయి, బెంగుళూరు నేషనల్ హైవే మీదుగా ప్రయాణించేవారు అద్భుత అందాలతో విలసిల్లే ఖొపోలీ - ఖండాలా ఘాట్ రోడ్ మీదుగా ప్రయాణిస్తారు. ఈ ఘాట్‌లో సుమారు ఎనిమిది కిలోమీటర్లు 369 మీటర్ల ఎత్తున ప్రయాణించాల్సి ఉంటుంది.



ఇక్కడ అనేక సినిమాల షూటింగ్‌లు జరుగుతూ ఉంటాయి. చక్కటి ప్రకృతి దృశ్యాలు ఉండటయే ఇందుకు కారణం. ఇక్కడ ఉన్న చిన్నాపెద్దా పార్కులు కూడా సినిమా షూటింగ్‌లకు అనువుగా ఉంటాయి. హిందీ సినిమాలే మాత్రమే గాక తెలుగు సినిమాల షూటింగ్‌లు కూడా ఇక్కడ జరుగుతుంటాయి.

ఖండాలాలో చూడదగ్గ ప్రదేశాలు అనేకం ఉన్నాయి. ఇక్కడి పురాతన బౌద్ధ గుహలు 'చైత్య గుహ'లన్నింటిలోకీ పెద్దవి. ఇవి క్రీస్తుపూర్వం 160 నుంచే ఉన్నాయి. ఇక్కడకు వెళ్ళేందుకు లోనావ్లా నుంచి బస్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ చంద్రసేనియా కాయస్త ప్రభు ఆలయం, ప్రవేశంలోనే ఏకవీరా దేవి ఆలయాలున్నాయి. ఈ గుహల ప్రవేశంలోనే సింహస్థంభాలు, లోపల పెద్ద పెద్ద ఏనుగులు, వాటిపై వివిధ భంగిమలలో చెక్కిన బుద్ధుని ప్రతిమలు అద్భుతమన్పిస్తాయి. ప్రతి కిటికీకి ఇరువైపులా నృత్య భంగిమలో ఉన్న శిల్పాలు ఉన్నాయి. ప్రధాన ప్రవేశ ద్వారం రావి ఆకు ఆకారంలో ఉంటుంది. ఈ ద్వారంలో నుంచి అతి పెద్ద చైత్య గుహలోకి ప్రవేశిస్తాము. ఈ గుహ మొత్తం ఏనుగులు, మనుష్యుల ఆకారంలో ఉన్న రాతి స్థంభాలతో నిండి ఉంటుంది. ఈ గుహ ఉపరితలం చాలా ఎత్తుగానూ, అర్ధ వృత్తాకారంలో ఉంటుంది. ఈ స్థంభాలు చాలా నున్నగా కాంతులీనుతూ ఉంటాయి. ఇక్కడ అనేక విశ్రాంతి గదులు ఉన్నాయి. రాతితో మలచిన ఈ గదులు చాలా ప్రశాంతంగా ఉంటాయి. చుట్టుపక్కల ఉన్న చెరువుల్లో తాగునీరు లభ్యమవుతాయి. దీనికి చుట్టుపక్కల భోజ గుహలు, బేడ్సా గుహలు కూడా ఉన్నాయి.

లోనావ్లా పట్టణానికి మంచి నీటిని సరఫరా చేసే తుంగర్లీ సరస్సు కూడా చక్కటి పర్యాటక కేంద్రంగా ఉంది. ఇది తుంగర్లీ గ్రామం సమీపంలో ఉంది. ఇక్కడి కొండపై నుంచి చూస్తే రాజ్‌మాచీ, లోహఘడ్, విసాపూర్ దుర్గాలను, లోనావ్లా పట్టణ అందాలను తిలకించగలం.

లోనావ్లాలో తయారయ్యే రకరకాల చిక్కీలు, కారపూసలు, జెల్లీలు ప్రసిద్ధి. ఇక్కడకు వచ్చిన వారు వాటి రుచిని తప్పక ఆస్వాదిస్తారు.

లోనావ్లా - ఖండాలాకు వెళ్లాలంటే చక్కటి రవాణా సదుపాయాలున్నాయి. అనుకూలమైన రోడ్డు, రైలు మార్గాలున్నాయి. ముంబాయి నుంచి పూనా మీదుగా దక్షిణ భారతదేశానికి వెళ్ళే ప్రతి రైలూ లోనావ్లా మీదుగానే వెళ్తుంది. పూనా నుంచి లోకల్ రైలు సదుపాయం ఉంది. దీనికి అతి దగ్గరగా ఉండే విమానాశ్రయాలు ముంబాయి, పూనా. అతి సమీపంలోని అంతర్జాతీయ విమానాశ్రయం ముంబాయి కాగా స్థానిక విమానాశ్రయం పూనాలో ఉంది. అంతర్జాతీయ విమానాశ్రయం 110 కి.మీ. దూరాన ఉండగా పూనా విమానాశ్రయం 66 కి.మీ. దూరంలో ఉంది. ఇక్కడ బస చేసేందుకు అనుకూలమైన హోటళ్ళు కూడా అందుబాటులో ఉన్నాయి. ★



జనక జజ్ఝంత...తత...!

గోర్ల బుచ్చన్న

"జనక జజ్ఝంత....తత... జనక జజ్ఝంత....తత..." శబ్దం ఒక నాదమై ... నాదం అనునాదమై... అనునాదం ప్రకంపనమై దోపీడి సమాజాన్ని ప్రశ్నిస్తుంది. ఈ సమాజానిక మెసేజ్ ఇచ్చే గుణం ఈ శబ్దానికి ఉంది. సామాజిక స్పృహ ఉంది. పెత్తందార్ల కొమ్ములు విరిచే శక్తీ ఉంది. ఈ శబ్దం ఈ మధ్య కాలంలో ప్రపంచ వేదికలపై కూడా తన చైతన్యాన్ని ప్రదర్శిస్తోంది. ధ్వంసమైన వృత్తులకు, ప్రంపచీకరణ పడగనీడలో పతనమైన బతకులకు తన దరువుల ద్వారా రూపమిచ్చింది. అదే డప్పు... మాదిగడప్పు!!

ప్రాచీన కాలం నుండి డప్పుకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఇది ఎప్పటి నుండి ఉనికిలోకి వచ్చిందనే విషయం కంటే ఏ మేరకు సమాజాన్ని చైతన్యవంతం చేసిందనేదే ముఖ్యాంశం. ఆయా కాలాల్లో సామాజిక, ఆర్థిక పరిస్థితులపై దీని ప్రభావం ఎక్కువగానే ఉందని చెప్పుకోవాలి. అప్పట్లో రాజుల నుండి వచ్చిన సందేశాన్ని రాజ్యంలోని ప్రజలకు చేరవేయాలంటే డప్పుద్వారా చాటింపు వేసి చెప్పేవారు. నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ ద్వారా బియ్యం వచ్చాయని, కిరోసిన్ తదితరాల వచ్చాయని, వాటిని ఫలానా తేదీ వరకు మాత్రమే ఇస్తారని దీని ద్వారా చాటింపు వేయిస్తారు. సమాజాన్ని జాగృతం చేయడంలో దీనికి ఎనలేని ప్రాధాన్యత ఉంది.

ప్రస్తుతం పలు సంగీత వాయిద్యాలున్నా కూడా డప్పు తన ప్రాధాన్యతను కోల్పోలేదు. ఇది ఇటీవల ఉద్యమకళా, చైతన్యానికి మారుపేరుగా కణకణమంటోంది. దీనికి స్పష్టమైన లాంగ్వేజీ ఉంటుంది. ప్రభుత్వ సందేశాలను జనానికి చేరవేస్తుంది. దోపీడికి గురవుతున్న వారిని చేరదీస్తుంది. విప్లవకారుల పాటలకు లయనందిస్తూ నిద్రావస్తలో ఉన్న వారిని దోపిడీ సమాజంపైకి ఉవ్వెత్తున ఎగిసిపడే కెరటాల్ని చేసేగుణం ఉంది. శ్రమజీవుల కష్టాలను పల్లవిగా, చరణాలుగా చేసుకుని జగ్గనకుం....నకనకనం....జగ్గనకుం....నకనకనం...అంటూ శ్రావ్యమైన సంగీతాన్ని ఇస్తుంది. మైమరిపిస్తుంది. మంత్రముగ్ధుల్ని చేస్తుంది. "జెగ్గనక్...జెగ్గనక్... జెగ్గుజెగ్గు....జెగ్గనక్....నకునం" శబ్దం వినగానే ఎవరో పాటపాడుతున్నారనే సంకేతాలను పంపిస్తుంది. ఇది పడుకున్న వాన్ని లేపుతుంది. ఏడ్చేవాన్ని నవ్విస్తుంది. ఉత్సాహపరుస్తుంది. ఉద్రేకపరుస్తుంది. ఉగ్రూతలూగిస్తుంది.

1940లో నుండీ తెలుగు సినిమాలలో గ్రామీణ వాతావరణాన్ని చూపెట్టే సన్నివేశాల్లో తప్పనిసరిగా డప్పు డప్పు కళాకారుణ్ణి, పాటల్లో డప్పులయను చక్కగా, వీనులవిందుగా ఉపయోగించారు. "రోజులు మారాయి" సినిమా గుర్తొస్తే అందులోని "ఏరువాకా సాగారో రన్నో చిన్నన్నా" పాట లేదా పాట గుర్తొస్తే ఆ సినిమాగుర్తొస్తాయి. అంతగా గుర్తుండిపోయేలా చేసిందీ ఆ పాటకు లయనందించిన ఈ డప్పువాయిద్యమే. ఇప్పటికే ఆపాటలో వినబడే తోలుడప్పు ప్రకంపనలు మనల్ని పులకింపజేస్తాయి.

హార్మోనియన్లు ఇతర సంగీత వాయిద్యాల మధ్య, పాప్‌నృత్యాల పదనిసల మధ్య తనదైన శైలీలో ప్రజల మధ్యనే ఉంటోంది. వాటితో పోటీ పడుతోంది. ధీటైన సంగీతాన్ని ఇస్తోంది. తనను తాను కాపాడుకుంటూనే సమాజాన్ని కాపాడుతోంది. ఇంగ్లీషు పాటలకు సైతం రిథమ్‌ను అందిస్తోంది. సమాజ నవీన పోకడలకు ఇది నాందీవాచకం. ఎన్ని అటంకాలొచ్చినా ఇది ప్రాముఖ్యతను కోల్పోలేదు.

ఈ నేపథ్యంలో పాప్ సంగీతంతో డప్పును మేళవించి ప్రస్తుతం సమాజానికి, రాబోయే తరాలకు అందిస్తానని అంటున్నాడు. ప్రముఖ డప్పు కళాకారుడు లెల్లె సురేష్, ఆయన "చిందు" సంస్థ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. దేశవిదేశాల్లో డప్పు ప్రదర్శనలిచ్చారు.

ఖమ్మం జిల్లా మధిర తాలుకాలో దళిత కుటుంబంలో పుట్టిన సురేష్ జెఎన్‌టియులో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. కొంత కాలంపాటు ప్రజా ఉద్యమాల్లో పనిచేశారు. అనంతర కాలంలో డప్పు ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయాలనే ఉద్దేశ్యంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రదర్శనలిస్తున్నారు. 1998 నుండి తన కార్యక్రమాలు ముమ్మరం చేశారు. డప్పు సంగీతం నిరంతర ప్రవాహం అంటున్నారీయన. నూతన సమాజ నిర్మాణం కోసం ఇది పనిచేస్తోందని చెబుతారు. దీనికి పోరాడేశక్తి ఉందని, అందుకే దీన్ని నమ్ముకుని ప్రజా జాగృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అంటున్నారు.

ఈ సందర్భంగానే 2000 సంవత్సరంలో దక్షిణాఫ్రికా దర్బన్‌లో ప్రదర్శనలిచ్చారు. దళిత, అట్టడుగు వర్గాల వారు ఎదుర్కొంటున్న వివక్షతలను ప్రపంచం దృష్టికి కళాత్మకంగా తీసుకొచ్చారు. కుల వ్యవస్థ కుతంత్రాన్ని బట్టబయలు చేశారు. సమాజం కొత్తపుంతలు తొక్కుతున్నా భారతదేశంలో నిమ్నవర్గాల వారిపై కొనసాగుతున్న సామాజిక అణిచివేతలను, వారి వెతలను ప్రపంచం కళ్లకు కట్టించారు. అప్పటికప్పుడు పాటలు కట్టి డప్పు ద్వారానే వాటికి బాణీలు కడతారు. ఈ మధ్య బ్రెజిల్‌లో జరిగిన ప్రపంచ వేదికపై ప్రదర్శనలిచ్చారు. డప్పును భవిష్యత్తు తరాలకు అందించాలనే లక్ష్యంతో డప్పుపై "మహాదిగ" అనే డాక్యుమెంటరినీ తీశారు. దీన్ని రాబోయే తరాలకు అందించడానికి శతవిధాల ఆయన ప్రయత్నిస్తున్నారు. ☆

పల్లెను గ్లోబలైజేషన్ మింగేసింది

ఎద్దుల మువ్వల గలగలలు విందామని ఆశపడ్డా
గిత్తల రంకెలు, లేగదూళ్ళఅరుపులు వినాలని ఆరాటపడ్డా
అయినకాడికి సంతెల్లి పశువులను రైతు అమ్ముకుంటున్నాడని
తెలియక
గలగలపారే కాలువల ఒడ్డున చద్ది మూటవిప్పి రైతన్నలకోసం
చూశా
నా ఛాదస్తంగానీ, ముష్టికాయలు మృష్టాన్నంగా తింటున్నప్పుడు
ఎందుకుంటారు గనక!
ఆబగా పోయి రోడ్డు పక్కచేలో ఊసకంకులిరుద్దామనుకున్నా
దాని ఆనవాళ్ళను వెతికి, పట్టాలని తెలిసింది మరి!
మంచెపై నిల్చుండి విసిరె 'వడిశెల్ల' జాడేలేదం!!!
రైతే రెక్క విరిగిన పక్షి అయి వలసదార్లు పడుతుంటే
నా పిచ్చిగానీ, పక్షులెక్కడుంటాయి గనక?
డొంక దార్లెంబడి స్వాగతం చెప్పడానికా అన్నట్లు
తలలెగరేసి నిటారుగ నిలుచుండె చెట్లకోసం పరికించా
ఊహూఁ... బ్రహ్మజెముళ్ళు, పల్లేర్లు సమాంతరంగా పోటీ పడ్తున్నయ్
నిన్నటి హోళీ రంగులకి మోదుగుపూలకై పల్లెంతా గాలించా
ఆ మోదుగ పూలూ లేవూ, పిల్లలాడుకునే గచ్చకాయలూ లేవు
పోనీ, రంగవల్లులతో కళకళలాడే రైతన్నల లోగిళ్ళు చూద్దామనుకున్నా
దయలేని సర్కారోళ్ళ జప్తుకేకలతో గూళ్ళు పోయాయన్న చేదునిజం తెలిసింది
చినకుపడిన మట్టివాసన చూద్దామని పిడికిట పట్టానా...
రక్తపు చారికలతో కలగలసిన ఆ మట్టి వెగటు వాసన వేసింది
కల్తీ మందుల పుణ్యమా అని బలిసిన పురుగుల లెక్కిస్తూ
తాలూ తప్పా పట్టి పట్టి ఏరుకుంటున్న వైనం
పురుగుమందే తులసి తీర్థమైన దైన్యం

సాగునీరు, త్రాగునీరు లేక కంటినీరే ఏరైన
రైతుజనం
నెర్రెలిచ్చిన భూమి రైతన్నను వెక్కిరిస్తోంది అనుదినం
ఇప్పుడు పల్లెల్లో పచ్చనిపైరుల కళకళలూ లేవు
గర్వంగా మీసం మెలితిప్పిన ఒకప్పటి రైతన్నా
లేడు
పల్లె సోయగాలను 'గ్లోబలైజేషన్' మింగేయగా
మిగిలిందల్లా బీడుపడ్డ భూములు -
బోసిపోయిన గాదెలు
పల్లేర్లు మొలిచిన నా పల్లెలే పల్లెకాదుమరి!

-సంపటం దుర్గాప్రసాదరావు

వలస పక్షులు

పల్లెల నుండి పట్టణాలకు
పిడికెడంత అన్నంకోసం
పొట్టపట్టుకొని
దేహీ దేహీ అంటూ...
కళ్ళల్లో ఆశ నింపుకుని
బ్రతుకుపై పేరాశ పెంచుకుని
బహుదూరపు బాటసారిలా
బ్రతుకుతెరువు వెతుక్కుంటూ... మీరు
ఉండేలు దెబ్బకెక్కడ ఒరిగిపోతామోనని
ఏ రాబందుల రెక్కల చప్పుడులో
అదృశ్యమైపోతామోనని
జనారణ్య క్రూర మృగాల మధ్య బ్రతుకెక్కడ
ముగిసిపోతుందోనని
భయం భయంతో మీరు బిక్కు బిక్కుమంటూ... మీరు
బీళ్ళుపడ్డ భూమిలో పంటలు పండించలేక
నగరాల నడిఒడ్డున భవనాలను పండిస్తూ
పునాది రాళ్ళలో మీరు సజీవ సమాధి
అవుతుంటే...మీరు
గాజు కళ్ళ అస్థిపంజరాలు
చర్మాన్ని తగిలించుకుని కళేబరాల్లా
కొడిగడుతున్న ప్రాణాన్ని కౌగిలించుకుని
పల్లెల్లో మీకోసం ఎదురుచూస్తూ మీ వాళ్ళు...

-"మ ఉని"

గజల్

ప్రతిజీవికి ఉంటాది బ్రతకాలని
లోకం తెరమీద తనరూపం నిలవాలని
పతనమవుతున్న విలువలను ప్రక్కకు నెట్టి
కొందరైన అనుకుంటారు మంచితనంలో తడవాలని
మనసునపడ్డ నల్లని మచ్చలను తుడిచేసి
తపిస్తారు చెలిమి మార్గాన నడవాలని
బతుకు బాటలో పడిన ముళ్ళను ఏరి
శ్రమిస్తారు మమతల పూలను చల్లాలని
తెగినట్టి తీగలనల్ల సవరించి
దీక్ష వహిస్తారు మధురస్వరాలు పలికించాలని
అందరూ కలిసిమెలసి అడుగులేసినపుడు
ఉవ్విళ్ళూరుతుంది ప్రేమమందిరాన్ని తెరవాలని
జీవితం తీపిని ఊరిస్తూ సాగిన వేళ ఓ పృథ్వి
కళ్ళు రెండూ వేనవేలుగ మారుతుంది చూడాలని

-యస్.ఆర్. పృథ్వి

కల 'కలం'

అణగారిన అక్షరాలతో
అధికారాన్ని ధిక్కరించే స్వరం కలానిది!
బావాల బాహాభాహిలో
పదునెక్కిన ఆయుధమిది
కలం సిరారక్తాన్ని చిందించే శ్రామికుడు!
కలం ప్రశ్నించే వాడి గుండె చప్పుడు
జీవనభారాన్ని అలవోకగా మోసే పల్లకి!
జీవిత గీతాన్ని ఆహ్లాదంగా విన్పించే పల్లవి!
కలం కష్టాన్ని స్రవించే స్వేదధార!
కలం సుఖాన్ని సృజించే గేయధార!
పదాల్ని పండించే నాగలి
బాధల్ని ఓదార్చే పిడికిలి!
కలం కావ్యాల్ని దాచిపెట్టే రహస్యం!
కవిత్వాన్ని సాధించే విప్లవం!!

-పూల రామకృష్ణారావు

ADVOCATE

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

పుట్టినతేదీ మార్పు ఎలా?

నా యొక్క పుట్టినరోజు టెన్త్ సర్టిఫికెట్‌లో తప్పువచ్చింది. ప్రైమరీ పాఠశాలలో 15-6-1880 ఉంది. దీనికి బదులు 15-6-1977 వచ్చింది. ఇప్పుడు నా అన్నయ్య కంటే నా యొక్క వయస్సే ఎక్కువుంది. దీన్ని కరెక్టు చేయించాలంటే ఏమైనా సలహా ఇవ్వండి.

ఎస్. సింగ్, మెదక్.

మీరు ముందుగా డి.ఇ.ఓ కు దరఖాస్తు పెట్టుకోండి. వారు మార్చకపోతే డి.ఇ.ఓ ను ఎస్.ఎస్.సి బోర్డ్‌ను ప్రతివాదులుగా చేస్తూ దగ్గరలోని కోర్టులో దావావేయాల్సి ఉంటుంది. మీరు పెట్టుకున్న దరఖాస్తుతోనే డి.ఇ.ఓ. మార్పుచేయవచ్చు. అలాకాని పక్షంలో కోర్టుకెళ్లాల్సి ఉంటుంది.

కోర్టు తీర్పు కోసం ఆగండి

నేను బీదకుటుంబమునకు చెందిన వారి భార్యను. నాకు 1974లో పెండ్లి నా మేనమామతో జరిగింది. నాకు అప్పటిలో నా మేనమామగారు ఐదు సవర్ల బంగారం పెట్టి నన్ను వాళ్ళు కట్నము లేకుండా పెండ్లి గూడా మా అమ్మనాన్న గార్లే ఖర్చుపెట్టి పెండ్లి చేశారు. మా అమ్మగారు 1977 జూన్‌లో 12సెంట్లు స్థలము కొన్నది. కొన్నప్పుడు భర్తపోషణ అని రిజిస్టారు నకళ్ళలో చదవగా తెలిసినది. మా అమ్మగారు 2001లో చనిపోయారు. చనిపోయే ముందు అందరిని తీసుకోమని చెప్పి చనిపోయినది. మానాన్న గారు వున్నారని ఇప్పటికీ పంచుకోలేదు. మా నాన్నగార్కి 5600 రూపాయలు పింఛను వస్తుంది. అయన పేరుమీద వున్న ఇల్లు ఆరునెలల క్రితం అమ్ముకొన్నారు. మా అమ్మగారి ఆస్తి కూడా అమ్మజూపినారు. అద్వాన్ను కూడా తీసుకున్నారని తెలిసి లాయరు నోటీసు యిస్తే నా భార్య స్వయంఆస్తి అని నోటీసు ఇచ్చినారు. దాని నకళ్ళు పంపమంటె పంపలేదు. యిప్పటికి రెండు సంవత్సరాలుగా కోర్టులో వాయిదాలు పడుచున్నవి. నాకు యిపుడు ఆరోగ్యం బాగా లేదు. మేము ఇద్దరు ఆడపిల్లలు, ముగ్గురు మగపిల్లలము. ఆ ఆస్తి వాటాలు మా ఐదుగురికా లేక మానాన్నగారికి చెందుతుందా. సలహా ఇవ్వగలరు.

కె.బి.వి.రాణి.

తెనాలి.

మీ అమ్మగారు ఆ భూమి ఎలా కొన్నారు. ధనం ఆవిడ పుట్టింటిదా? మీ తండ్రిగారు ఇచ్చారా అన్నది తెలుపలేదు. మీరు ఈ పాటికే కోర్టునాశ్రయించారు కాబట్టి కోర్టు తీర్పు వచ్చేవరకు వేచిచూడండి.

పరీక్షరాసే రూల్ ఉందా?

నాకు వయస్సు ఎక్కువగా వుంది. ప్రస్తుతం నా యొక్క వయస్సు 16 సంవత్సరాలు. నేను కొంచెం బాగానే చదువుతాను. ఇప్పుడు నేను చదువుతున్న తరగతి 8వ తరగతి. నేను 9వ తరగతి చదవకుండ పదవతరగతి వెళ్ళవచ్చునా. ఇప్పుడు నేను గవర్నమెంట్ స్కూల్‌లో చదువుచున్నాను. అదే గవర్నమెంట్ స్కూల్‌లో పదవతరగతి చదవవచ్చునా. లేకపోతే ప్రైవేట్ స్కూల్‌లో చదవవలెనా. 9వ తరగతి చదవకుండా 10వ తరగతి చదివే రూల్ అసలు వుందా లేదా కొంచెం తెలియజేయగలరు.

నీణావత్తు యోగి,

పెద్ద నందిపాడు, గుంటూరు.

మీకు సరియైన వయస్సు ఉంటే ప్రయివేటుగా ఎస్.ఎస్.సి. పరీక్షలో పాల్గొనవచ్చు. మీరు చదివే పాఠశాలవాళ్ళు అనుమతించకపోతేపోవచ్చు. అలా ఏమైనా ఉంటే ప్రయివేటు పాఠశాలలో జాయిన్ అయ్యి ఎగ్జామ్ వ్రాసుకోవచ్చు.

ఉద్యోగం రాదు

1989 అక్టోబర్ 26న నాకు ఆర్.టి.సి బస్సు యాక్సిడెంట్ జరిగింది. కొంత నష్టపరిహారం కోర్టుద్వారా పొందినాను. నాకు ఎడమకాలు తగిలినది. నాకు ఏ.పి.ఎస్.ఆర్.టి.సి ద్వారా ఉద్యోగము పొందే మార్గం ఏదైనా వున్నదా! నేను పేదవాడిని. నాకు ఎటువంటి ఆధారము లేదు. మెడికల్ సర్టిఫికేట్, కోర్టుకాగితాలు వున్నవి.

ప్రసాదరావు, గుంటూరు.

మీరు మీకు జరిగిన ఆక్సిడెంట్‌కు నష్టపరిహారం మాత్రమే పొందగలుగుతారు. ఎలాంటి ఉద్యోగం పొందలేరు. అలాంటి అవకాశాలు లేవు. మీరు ఈ పాటికి నష్టపరిహారం పొందారు కాబట్టి ఇంక మీకు ఎటువంటి భృతి, నష్టపరిహారం లాంటివి ఏమిరావు.

పెసరపప్పు, మామిడి కాయ పచ్చడి

కావలసిన వస్తువులు:

పెసరపప్పు	:	పావుకిలో
పచ్చి మామిడి కాయ	:	ఒకటి
పచ్చిమిర్చి	:	50 గ్రాములు
ఉప్పు	:	తగినంత
నూనె	:	రెండు టీ స్పూన్లు
పసుపు	:	తగినంత
తాలింపు గింజలు	:	పోపుకు
కరివేపాకు	:	రెండు రెబ్బలు
కొత్తిమీర	:	ఒక కట్ట
ఇంగువ	:	చిటికెడు

తయారుచేసే విధానం: పెసరపప్పు రాళ్ళు లేకుండా శుభ్రం చేసుకొని ఓ గంట నానబెట్టాలి. మామిడి కాయ చెక్కు తీసి ముక్కలు చేసుకోవాలి. పెసరపప్పులో నీళ్ళు వార్చి, మామిడి కాయ ముక్కలతో కలిపి ఉప్పు, పసుపు వేసి నూరాలి. బాండీలో నూనె వేసి కాగిన తరువాత తాలింపువేసి ఈ పచ్చడి వేయాలి. దీనిని వెంటనే దింపేయాలి.

పల్లీలు, మామిడికాయ పచ్చడి

కావలసిన వస్తువులు:

వేరుశనగ పప్పు	:	ఒక కప్పు
పచ్చి మామిడికాయ	:	ఒకటి
పచ్చి మిర్చి	:	50 గ్రాములు
నూనె	:	రెండు స్పూన్లు
ఉప్పు	:	తగినంత
కరివేపాకు	:	రెండు రెబ్బలు
ఇంగువ	:	చిటికెడు
జీలకర్ర	:	టీ స్పూన్

తయారుచేసే విధానం:

వేరుశనగ గింజలు సన్న సెగమీద వేయించి పొట్టు శుభ్రంగా చెరిగేయాలి. మామిడికాయ చెక్కు తీసి ముక్కలు తరిగి వేరుశనగపప్పు, పచ్చిమిర్చి, ఉప్పు వేసి మెత్తగా రుబ్బాలి. బాండీలో నూనె వేసి కాగిన తరువాత తాలింపుగింజలు, జీలకర్ర, కరివేపాకు, ఇంగువ, పసుపు వేయాలి. ఈ తాలింపులో రుబ్బిపెట్టుకున్న పచ్చడి వేయాలి.

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్
- కొత్త కోర్సుల వివరాలు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి.న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'మాథ్స్ స్కిల్స్'
- పోటీ పరీక్షల మెటీరియల్, మోడల్ పేపర్స్
- కెరీర్ గైడెన్స్
- ప్రతివారం ఓ ప్రత్యేక సమాచారం
- 'వ్యక్తిత్వవికాసం'

దీపిక

చందాదారులుగా చేరండి

సమాచారం

మీ ముంగిట నిలుస్తుంది

ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే

ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక

అమూల్యమైన సమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ.150లు, పోస్టు ద్వారా రూ.160లు

అర్థసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రు.80లు, పోస్టుద్వారా రూ.85లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ./డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్. ఫోన్: 276645420, 27663761

మేనేజర్: 27673787, ఫ్యాక్స్: 2763921.

Website: www.prajasakti.com, e-mail: prajasakti@hotmail.com